Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com

# ప్రజా మంటలు

సంపుటి: 4 సంచిక: 171
పేజీలు - 8 వెల- రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

బుధవారం 14, ఫిబ్రవరి-2024

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon, Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## సమ్మక్క-సారక్క జాతరకు పోటెత్తిన భక్తులు



3లో..

## తెలంగాణలో బదిలీల పర్వం

### 40 మంది మున్సిపల్ కమిషనర్లకు స్థాన చలనం



హైదరాబాద్,ఫిబ్రవరి13 : తెలంగాణలో అధికారుల బదిలీల పర్వం కొనసాగు తోంది. తాజాగా 40 మంది మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. బుధవారంలోగా బదిలీ చేసిన కార్యా లయంలో రిపోర్ట్ చేయాలని ఉన్నతాధి కారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ 40 మంది మున్సిపల్ కమిషనర్లు బుధవా రమే కొత్త కార్యాలయంలో బాధ్యతలు తీసుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదీల ప్రక్రియ కొనసాగుతోంది. చాలా శాఖల్లోనూ అధికారులకు స్థానచలనం కలుగుతోంది. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖలోకి 395 మంది ఎంపీడీవోలను సర్కార్ వేరే చోటుకి పంపింది. మిగతా 2లో..

## తెలంగాణలో నలుగురు ఐఏఎస్, 12 మంది ఐపీఎస్‌ల బదిలీ



హైదరాబాద్, ఫిబ్రవరి 13 : రాష్ట్రంలో నలుగురు ఐఏఎస్, 12 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ అదనపు కలెక్టర్ చిత్రమిశ్రాను ఐటీడీఏ ఏటునాగారం ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేశారు. ఐటీడీఏ ఏటునాగారం ప్రాజెక్టు అధికారి అంకిత్‌ను నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాను ఉట్నూరు ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేశారు. మిగతా 2లో..

## పంజాబ్-హర్యానా బోర్డర్‌లో యుద్ధ వాతావరణం



- దేశ రాజధానిలో మరోసారి కదంతొక్కిన రైతులు

## కెఆర్ఎంబికి ప్రాజెక్టుల అప్పగింతపై
# తెలంగాణ అసెంబ్లీ తీర్మానం

- తీర్మానాన్ని ప్రవేశపెట్టిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్‌రెడ్డి
- అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం



హైదరాబాద్, ఫిబ్రవరి 13 : తెలంగాణ ప్రభుత్వం విధించిన షరతులను అంగీకరిస్తేనే ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా నది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి)కి అప్పగించాలని, షరతులను అంగీకరించకపోతే అప్పగించేది లేదని తెలంగాణ అసెంబ్లీలో తీర్మానించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. పరీవాహక ప్రాంతం, కరువు పీడిత ప్రాంతం, బేసిన్ జనాభా, సాగు చేయదగిన ప్రాంతం ఆధారంగా రెండు తెలుగు రాష్ట్రాలకు నీటి కేటాయింపులు చేయాలి చేయాలని, కృష్ణా వాటర్ డిస్పూట్ ట్రిబ్యునల్ (కెడబ్ల్యుడిటి) ప్రకారం ప్రాధాన్యతపై మొదట బేసిన్ అవసరాలు తీర్చాలని, సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) నిబంధనల ప్రకారం శ్రీశైలం నుంచి జలాలను వినియోగించుకో వడానికి అనుమతి ఇవ్వాలని, కృష్ణా బేసిన్ బయట ప్రాజెక్టులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని తరలించరాదని మిగతా 3లో..

## మేడిగడ్డపై విజిలెన్స్ రిపోర్ట్‌లో
# సంచలన విషయాలు!!

- అంచనా 2వేల 472కోట్లు..
- ఖర్చు 4వేల 321కోట్లు
- 133.67 శాతం అంచనాలు పెంచిన గత ప్రభుత్వం



హైదరాబాద్,ఫిబ్రవరి13 : మేడిగడ్డ బ్యారేజ్‌కు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణ సర్కార్ విజిలెన్స్ విచారణ చేపట్టడంతో అనేక అక్రమాలు బయటపడ్డాయి. కేసీఆర్ సర్కార్ భారీగా అంచనాలను పెంచేసినట్టు విజిలెన్స్ విచారణలో తేలింది. మేడిగడ్డ ప్రాజెక్టు మొదట అంచనా రూ. 2 వేల 472 కోట్లు. ఏకంగా 133.67 శాతం అంచనాలు గత ప్రభుత్వం పెంచేసింది. 4 వేల 321 కోట్లు ఖర్చు చేసింది కేసీఆర్ సర్కార్. ఈ విషయాలను ఆధారాలతో సహా విజిలెన్స్ బయటపెట్టింది. డ్యామ్ కుంగిపోవడానికి గల అనేక కారణాలు, అనుమానాలను తెరపైకి తీసుకొచ్చింది విజిలెన్స్. డ్యామ్ నిర్మాణం పూర్తయ్యాక కాఫర్ డ్యామ్, షీట్ ఫైల్స్‌ను తొలగించలేదు. అందువల్లే పియర్స్ కుంగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేసింది. నదీ సహజ ప్రవాహంపై కాఫర్ డ్యామ్ ప్రభావం పడిందని తేల్చింది. డిజైన్‌లో ఉన్నట్లుగా కటాఫ్ వాల్స్‌కు, రాఫ్ట్ వాల్స్‌కు మధ్య నిర్మాణం జరగలేదని విజిలెన్స్ విచారణలో తేలింది. అసలు నిర్మాణమే పూర్తి కాకపోయినా 2019న సెప్టెంబర్ 10న సర్టిఫికెట్ జారీ చేసింది. పనులు పూర్తికాకుండానే 2021 మార్చి 15న ఏజెన్సీకి పనులు పూర్తైనట్లు సర్టిఫికెట్ ఇచ్చేసింది అప్పటి మిగతా 3లో..

## కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజే కాదు



- ఒక బ్యారేజీ పిల్లర్లు కుంగితే ఇష్యూ చేస్తున్నారు
- శాసనసభలో సభా సంప్రదాయాలను ఉల్లంఘిస్తున్నారు
- ప్రధాన ప్రతిపక్షానికి మైక్ ఇవ్వకపోవడం అప్రజాస్వామికం

3లో..

## మేడిగడ్డ నిర్మాణంలో
# ఎన్నో లోపాలున్నాయి

- భారాస నేతలకు ఏటీఎంలా కాళేశ్వరం ప్రాజెక్టు
- తెలంగాణ ప్రజలకు వాస్తవాలు తెలియాలి
- రెండు మూడు రోజుల్లో శ్వేత పత్రం విడుదల చేస్తాం
- మేడిగడ్డ బ్యారేజ్ ను కళ్లారా చూశాకే.. నివేదికపై చర్చిస్తాం
- కేసీఆర్ కూడా మేడిగడ్డకు రావాలి
- హెలికాప్టర్ సిద్ధంగా ఉంది
- హరీష్ కూడా మేడిగడ్డకు రావాలి
- అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,ఫిబ్రవరి13 : మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో ఎన్నో లోపాలున్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 5వ రోజు అసెంబ్లీ సమావేశాలు మొదలవ్వగా.. మంత్రి భట్టి విక్రమార్క ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పై చర్చ మొదలుపెట్టారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలోనూ లోపాలున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు మేడిగడ్డ వాస్తవాలను కళ్లారా చూసేందుకు బీఆర్ఎస్ సభ్యులు కూడా రావాలని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుతగిలారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మేడిగడ్డపై అధికారులు ఇచ్చిన నివేదికను చర్చించాలంటే ముందు వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. మేడిగడ్డ నిర్మాణ లోపం వల్ల కుంగిందా, ఇసుకలో పేకమేడ కడితే కుంగిందా ? బాంబులు వేయడంతో కుంగిందా అన్నది చూసి తెలుసుకోవచ్చన్నారు. కేసీఆర్ సృష్టించిన అద్భుతం గురించి.. ఆయనే సభ్యులకు వివరిస్తే బాగుంటుందన్నారు. మిగతా 3లో..

## రైతు రుణమాఫీపై అధికారుల అధ్యయనం

- రైతుల అప్పుల వివరాలు సేకరిస్తున్న అధికారులు
- డేటా రాగానే రుణమాఫీ అమలుచేస్తాం
- ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తాం
- ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి కీలక ప్రకటన




3లో..

## నిరసనకు సిద్ధమైన రైతులు

- ఆరు నెలలకు సరిపడా నిత్యావసరాల సమకూర్పు
- ఢిల్లీలో భారీ నిరసనకు అన్నదాత సన్నద్ధం
- శంభు సరిహద్దు వద్ద ఉద్రిక్తత
- రైతులపై బాష్పవాయువు ప్రయోగం
- రాజధాని సరిహద్దుల్లో భారీ ట్రాఫిక్‌జామ్

వివరాలు 3లో..

## ప్రజానాడి



## కట్టె కాలే వరకు పులిలా పోరాడుతా

- ఆరు నూరైనా తెలంగాణకు అన్యాయం జరగనివ్వను
- కృష్ణా జలాలకై చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం
- నీళ్లు లేకపోతే తెలంగాణ ప్రజలకు బతుకు లేదు
- నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ రహిత జిల్లాగా మారింది
- నల్లగొండ సభలో భారాస అధినేత కేసీఆర్
- అన్యాయాన్ని ఊరుకునేది లేదు
- చివరిశ్వాస వరకు పులిలా కొట్లాడతా
- బతుకనివ్వం.. వెంటపడుతం.. వేటాడుతం..!

కాంగ్రెస్ సర్కారుకు కేసీఆర్ హెచ్చరిక



వివరాలు 4లో..

# సమ్మక్క-సారక్క జాతరకు పోటెత్తిన భక్తులు

## బంగారాన్ని తలపిస్తున్న బెల్లం ధరలు

హైదరాబాద్,ఫిబ్రవరి13 : సమ్మక్క సారక్క అనగానే బెల్లం(బంగారం) గుర్తుకు వస్తుంది. ప్రతి రెండేళ్ళకి ఒకసారి జరిగే ఈ వేడుకను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారు. బెల్లాన్ని అమ్మవారికి సమర్పిస్తారు. కోరిన కోరికలు తీరిన తరువాత నిలువెత్తు బంగారం సమర్పించడం అనవాయితీగా వస్తోంది. జాతర కంటే ముందే ఇరవై రోజులనుండి అమ్మవారికి బెల్లాన్ని సమర్పిస్తుంటారు. ఎప్పుడూ అందుబాటులో ఉండే బెల్లం ధర ఇప్పుడు పెరుగుతు వస్తుంది. మొన్నటి వరకు కిలో రూ.30 ఉండగా ఇప్పుడు రూ. 60కి చేరుకుంది. బెల్లం ధరలు మరింత పెరిగుతుందని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మేడారంతో పాటు అనుబంధ జాతరలకి వెళ్తుంటారు. ముందుగా ఇంటి వద్ద అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. ఆ తరువాత ఇంటి వద్దనే లేదంటే జాతరల వద్ద నిలువెత్తు బంగారాన్ని సమర్పిస్తారు. ఈ విధంగా సమర్పించిన బంగారాన్ని భక్తులకి పంపిణి చేస్తారు. చాలా మంది భక్తులు నిలువెత్తు బంగారాన్ని సమర్పిస్తారు. అయితే ఇదే సమయంలో బెల్లపు ధరలు పెరుగుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 80 ప్రాంతాలలో అనుబంధ జాతరలు జరుగుతుంటాయి. ఈ జాతరలో ఉండే బెల్లం షాపులతో పాటు ఇతర ప్రాంతాల వద్ద భక్తులు బారులు తీరుతున్నారు. ఒకేసారి కిలోకు రూ. 30 వరకు ధర పెరిగింది. భక్తులు ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చెయడంతో కొంత మంది వ్యాపారస్తులు నాణ్యత లోపించిన బంగారం కుడా భక్తులకి అందిస్తున్నారు. హోల్ సెల్?గా కాస్తా తక్కువగా ఉన్నప్పటికీ రిటేల్?లో మాత్రం అధిక ధరకి అమ్ముతున్నారు. పల్లె, పట్నం అనే తేడా లేకుండా సమ్మక్క సారక్కని భక్తి భావంతో పూజిస్తారు. అమ్మవారి పూజ కోసం బెల్లాన్ని ప్రసాదంగా సమర్పిస్తారు. బెల్లం అని అనకుండా బంగారం అని పిలుస్తారు. మరో పది రోజుల పాటు జరగనున్న జాతర కోసం ఇంకా ఎక్కువగానే బెల్లాన్ని వినియోగిస్తారు. దీంతో ఈ ముడు, నాలుగు రోజులలో బెల్లం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు. అయితే భక్తులు ఇవన్నీ లెక్క జేయకుండా నిలువెత్తు బంగారాన్ని సమర్పించి తమ భక్తి భావాన్ని చాటుకుంటున్నారు.

# భట్టి సోదరుడు మృతి

హైదరాబాద్,ఫిబ్రవరి13 : తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన సోద రుడు మల్లు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా అనారో గ్యంతో బాధపడుతున్న ఆయన.. హైదరా బాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. హోమియో ఎండీ చదివిన మల్లు వెంకటేశ్వర్లు.. ఆయుష్ శాఖలో ప్రొఫెసర్ గా, అడిషినల్ డైరెక్టర్ గా పనిచేసి రిటైర్ అయ్యారు. వైరా 1వ వార్డులో ఉన్న తన నివాసంలోనే హోమియో ఆస్పత్రిని నిర్వహిస్తూ.. ప్రజలకు వైద్యం అందిస్తూ వచ్చారు. మల్లు వెంకటేశ్వర్లుకు హోమియో వైద్యంలో మంచి పేరుంది. అతని వద్ద వైద్యం చేయించుకునేందుకు రాష్ట్రంలో మిగతా ప్రాంతాల నుంచీ రోగులు వచ్చేవారు.మూడు నెలలుగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం.. మరింత క్షీణించడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఇటీవల హైదరా బాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే మూడు రోజుల క్రితం ఆయనకు గుండెపోటు వచ్చింది. కాలేయ సమస్య, గుండెపోటు కారణంగా ఆయన మంగళవారం ఉదయం కన్నుమూశారు. సాయంత్రం 5 గంటలకు స్వగ్రామమైన లక్ష్మీపురంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా.. భట్టి మరో సోదరుడైన మల్లురవి కాంగ్రెస్ పార్టీలోనే ఉండి.. ఢిల్లీలోని ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.

# తెలంగాణ అసెంబ్లీ తీర్మానం

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ డిమాండ్ చేసింది. ఈ షరతులకు అంగీకరించకుండా కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. 'కృష్ణా నది దక్షిణ తెలంగాణా ప్రాంతాలకు నీటిపారుదల, తాగునీటి అవసరాలకు జీవనాధారం. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 811 టిఎంసిల నీటిని కేటాయించారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా గణనీయమైన నీటిపారుదల సామర్థ్యాన్ని సృష్టించాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణా బేసిన్ అవసరాలపై తగిన శ్రద్ధ చూపకపోవడంతో అప్పటి ప్రభుత్వం తెలంగాణకు 299 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిల నీటి భాగస్వామ్యానికి రెండు రాష్ట్రాల మధ్య తీవ్ర అన్యాయమైన నిష్పత్తికి అంగీకరించింది. ఎపి పునర్ వ్యవస్థీకరణ చట్టం 2014 ద్వారా, రెండు రాష్ట్రాల మధ్య నీటి భాగస్వామ్యాన్ని నియంత్రించడానికి కెఆర్ఎంబి సృష్టించబడింది. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఉమ్మడి ప్రాజెక్టులు అంటే శ్రీశైలం డ్యాం, నాగార్జునసాగర్ డ్యామ్‌లను కెఆర్ఎంబి నియంత్రణకు అప్పగించాలని కూడా అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించింది' అంటూ తెలంగాణ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం అసెంబ్లీలో తీర్మానంలో పేర్కొన్నారు. ఈ తీర్మానంపై చర్చ సందర్భంగా అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కృష్ణా ప్రాజెక్టులను కెఆర్ఎంబికి అప్పగించేందుకు మీరే అంగీకారం తెలిపారని మంత్రి ఉత్తమ్, బిఆర్ఎస్ సభ్యులు హరీష్‌రావు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఈ సమయంలో సిఎం రేవంత్‌రెడ్డి కల్పించుకొని, దొంగలకు సద్ది మోసే విధానం మంచిది కాదని బిఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సభలో కృష్ణా జలాలపై చర్చ జరుగుతుంటే విపక్షనేత కెసిఆర్ ఫామ్ హౌస్‌లో పడుకుంటారా? ఆయన నిబద్ధత ఇదేనా? అని ప్రశ్నించారు. తీర్మానానికి అనుకూలమా.. వ్యతిరే కమా..అనేది స్పష్టం చేయాలని ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీని కోరారు. హరీష్‌రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ తలపెట్టిన నల్గొండ సభ వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తీర్మానం పెట్టిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ప్రాజెక్టులను కెఆర్ఎంబికు అప్పగించిందని విమర్శించారు. కృష్ణా జలాల వినియోగంపై మంత్రి ఉత్తమ్ అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సభ్యులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు మేలు జరిగేలా గత సిఎం కెసిఆర్ వ్యవహరించారని ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ టెండర్లను అపెక్స్ సమావేశంలో అడ్డుకునే అవకాశం ఉన్నా ఆ సమావేశానికి ఆయన ఉద్దేశపూర్వకంగా హాజరు కాలేదని విమర్శించారు. పోతిరెడ్డిపాడు నుంచి నీటిని అక్రమంగా తరలించుకుపోతున్నా అడ్డు చెప్పలేదన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో జరిగిన జలదోపిడీని అడ్డుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులను ఒత్తిడికి గురిచేసి తాము చెప్పినట్లే చేయాలని గత ప్రభుత్వం వారితో తప్పులు చేయించిందని దుయ్యబట్టారు. అధికారుల్లో బిఆర్ఎస్ ఏజెంట్లు చాలామంది ఉన్నారని, వారిపై త్వరలో చర్యలు ఉంటాయని అన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ చంద్రబాబు రెండోసారి సిఎం కాకూడదని కెసిఆర్ భావించారన్నారు. జగన్‌కు రాజకీయంగా లబ్ది చేకూర్చాలనే ప్రాజెక్టుల విషయంలో మెతకవైఖరి ప్రదర్శించారని విమర్శించారు.

# విజిలెన్స్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు!!

(మొదటిపేజీ తరువాయి)

గులాబీ సర్కార్. ఇంజనీర్ ఇన్ ఛార్జ్ ఇచ్చిన నోటీసును కూడా పట్టించుకోకుండా రూ. 159 కోట్ల సెక్యూరిటీస్ కూడా విడుదల చేసింది.ప్రాజెక్ట్ నిర్మాణ అనుమతుల విషయంలో కూడా భారీగా లోపాలు ఉన్నట్టు తేల్చింది విజిలెన్స్. అసలు అనేక నిర్మాణాలకు ఉన్నతాధికారుల అనుమతే లేనట్టు తేల్చింది. 2019 జూన్ 19న బ్యారేజ్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకూ ఏ ఏజెన్సీ గానీ, నీటిపారుదల శాఖ గాని ఎలాంటి తనిఖీలు, పరిశీలనలు చేయలేదని మొత్తం మేడిగడ్డ బ్యారేజ్ నిర్వహణ అస్తవ్యస్థంగా ఉందని తెలిపింది. ప్రతి వర్షాకాలం తర్వాత మేడిగడ్డ బ్యారేజ్ యాప్రాన్ ప్రాంతాన్ని మెయింటెనెన్స్ చేయాలి. కానీ అలా జరగలేదు. నిబంధనల ప్రకారం బ్యారేజ్ లో నీటి నిల్వల పెంపు, తగ్గుదల స్థాయిలను సరిగా మెయింటైన్ చేయలేదు. అసలు బ్యారేజ్ నిర్మించిన కాంట్రాక్టర్ నిర్మాణ పనుల మొత్తాన్ని పూర్తిచేయనే లేదని తేల్చింది విజిలెన్స్.మరో సంచలన విషయాన్ని బయటపెట్టింది విజిలెన్స్ రిపోర్ట్. లీకైన 6, 7, 8 పిల్లర్లను అస్సలు కాంట్రాక్ట్ సంస్థ ఎల్ అండ్ టి నిర్మించలేదు. ఆ పిల్లర్లను సబ్ కాంట్రాక్ట్ సంస్థ నిర్మించింది. ఈ వ్యవహారంపై పూర్తి ఆధారాలను విజిలెన్స్ సేకరించింది. మరో వైపు 3-డీ నమూనాల అధ్యయనాల ప్రకారం బ్యారేజ్ ఎగువ దిగువన వరద ప్రవాహాన్ని తగ్గించే పనులు చేపట్టనట్టు కూడా గుర్తించింది. ప్రాజెక్టులో ఏవైనా లోపాలున్నా.. నిర్మాణంలో అవకతవకలున్నా.. సరిచేయాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థదే. కానీ ప్రాజెక్ట్ కుంగిన తర్వాత అలా జరిగే అవకాశం లేకుండా పోయింది. ఎందుకంటే 2021లో కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వడానికి ముందే డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ 2020 నవంబర్ 11 నుంచి మొదలవుతుందంటూ ఇంజినీర్ ఇన్ చీఫ్ లేఖ విడుదల చేశారు. వాస్తవానికి బ్యారేజ్ పూర్తిగా నిర్మించి.. రెండేళ్లు పూర్తయిన తర్వాత అంతా బాగుంది అనుకుంటేనే ఈ లయబిలిటీ సర్టిఫికెట్ ఇవ్వాలి. కానీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నిర్మాణం పూర్తికాకుండానే ఈ సర్టిఫికెట్ ఇచ్చేశారు. అంతేకాదు సంస్థ సమర్పించిన బ్యాంక్ గ్యారంటీల తిరిగి చెల్లింపుకు అధికారులు అనుమతినిచ్చేశారు. దీంతో ఇప్పుడీ భారం మొత్తం ప్రజలపై పడనుంది. దీనిపై ఇంజినీర్ ఇన్ చీఫ్ పై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని సిఫార్స్ చేసింది విజిలెన్స్. బ్యారేజ్ కుంగుబాటుకు గల కారణాలు కోసం ప్రాజెక్టు డిజైన్స్ అండ్ డ్రాయింగ్స్ పరిశీలించాలని విజిలెన్స్ రిపోర్ట్ అభిప్రాయం వ్యక్తం చేసింది. వాటితోపాటు జియోలాజిక్ ఇన్వెస్టిగేషన్ తో బ్యారేజ్ లోని అన్ని కాంపోనెన్లు డిజైన్ ప్రకారమే ఉన్నాయా? ఒక దానికొకటి అనుసంధానమై పటిష్టంగా ఉన్నాయా? అన్న విషయాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటిని ఏర్పాటు చేయాలని విజిలెన్స్ నివేదిక ప్రభుత్వనికి సిఫార్స్ చేసింది.

# రైతు రుణమాఫీపై అధికారుల అధ్యయనం

- ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి కీలక ప్రకటన



హైదరాబాద్,ఫిబ్రవరి13 : రైతు రుణమాఫీపై ధరణి కమిటీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి కీలక ప్రకటన చేశారు. రైతుల అప్పుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారని తెలిపారు. డేటా రాగానే రుణమాఫీ చేస్తామని స్పష్టంచేశారు. ధాన్యానికి మద్దతు ధర ఇస్తామని చెప్పారు. అలాగే బోనస్ కింద రూ. 500 చెల్లిస్తామన్నారు. వరికి మద్దతు ధర ప్రస్తుతం రూ. 2060 రూపాయలుగా ఉంది. తాము రూ. 2600 చెల్లిస్తామని కోదండరెడ్డి హామీ ఇచ్చారు. కాగా తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు వేగంగా చర్యలు తీసుకుంటోంది. 6 గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమల్లోకి తీసుకొచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే టీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. అలాగే ఆరోగ్యశ్రీ పథకం పరిధిని రూ. 10 లక్షలకు పెంచింది. ఇప్పుడు ఎంతో కీలకమైన రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేసేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రకటించింది. ఈ స్కీమ్ ద్వారా ఎకరాకు రూ. 15 వేలు ఆర్థికసాయం అందిస్తామని తెలిపింది. రైతు కూలీలను ఆదుకుంటామని భరోసా ఇచ్చింది. వారికి ఏటా రూ. 12 వేలు ఇస్తామని భరోసా కల్పించింది. రైతుల రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఒకేసారి రూ. 2 లక్షల రుణాన్ని మాఫీ చేస్తామని ప్రకటించింది. ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకునే దిశగా చర్యలు ప్రారంభించింది. రైతు రుణమాఫీపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని.. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పారు.మరోవైపు 6 గ్యారంటీల్లో మిగిలిన పథకాలను అమలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది. ఇచ్చిన హామీలను 100 రోజుల్లోపే అమలు చేస్తామని సీఎం చాలాసార్లు చెప్పారు. ఆ మాట నెలబెట్టుకునే దిశగా కార్యాచరణ మొదలుపెట్టారు. త్వరలో గృహజ్యోతి పథకాన్ని అమలు చేయనున్నారు. ఇప్పటికే ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్హులను నిర్ణయించే ప్రక్రియ కొనసాగుతుంది. గృహజ్యోతి స్కీమ్ ద్వారా 200 యూనిట్ ఉచిత విద్యుత్ ను పేదలకు అందిస్తారు.అలాగే రూ. 500కే గ్యాస్ సిలిండర్లు అందించేందుకు చర్యలు చేపట్టారు. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల పథకంపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇలా 6 గ్యారంటీలను అమలు చేయడానికి చిత్తశుద్ధితో సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది.

# స్థిరమైన అభివృద్ధికి ముఫ్త్ బిజ్లీ యోజన తోడ్పాటు

## 'సూర్య ఘర్'పథకాన్ని ప్రారంభించిన మోదీ



న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(ఆర్ఎన్ఎ): సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించి సామాన్య పౌరులపై కరెంట్ ఛార్జీల భారం తగ్గించేలా ఈసారి బడ్జెట్‌లో కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే.దాని అమలుదిశగా కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. కోటి ఇళ్లకు ఉచిత విద్యుత్తును అందించేందుకు వీలుగా 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని ప్రారంభించింది. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీస్వయంగా ప్రకటన చేశారు. ఇందుకోసం సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. "మరింత స్థిరమైన అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన' పథకాన్ని ప్రారంభిస్తున్నాం. రూ.75 వేల కోట్ల పెట్టుబడితో తీసుకొస్తున్న ఈ ప్రాజెక్ట్‌తో.. ప్రతినెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించి కోటి కుటుంబాల్లో వెలుగులు నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీని కింద అందించే సబ్సిడీలను నేరుగా ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం. రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు బ్యాంకుల నుంచి భారీ రాయితీపై రుణాలు పొందొచ్చు. ప్రజలపై ఎలాంటి వ్యయభారం ఉండదని హామీ ఇస్తున్నాం" అని ప్రధాని మోదీ 'ఎక్స్ (ట్విటర్)'లో వెల్లడించారు.క్షేత్రస్థాయిలో ఈ పథకానికి ప్రచారం తీసుకొచ్చేందుకు.. పట్టణ స్థానిక సంస్థలు, పంచాయతీలకు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ప్రధాని తెలిపారు. వారు తమ పరిధిలో ఈ రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ప్రోత్సహించాలని సూచించారు. ఈ పథకంతో విద్యుత్ బిల్లులు తక్కువ రావడంతో పాటు ఉపాధి కల్పన జరుగుతుందని తెలిపారు. "సౌరశక్తిని, స్థిరమైన అభివృద్ధిని మరింత విస్తృతం చేద్దాం. గృహ వినియోగదారులు, ముఖ్యంగా యువత ఈ 'సూర్య ఘర్' పథకాన్ని బలోపేతం చేయాలని కోరుతున్నా. ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు" అని మోదీ వెల్లడించారు. అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని మోదీ ఈ పథకాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# ఔటర్ రింగ్ రోడ్డుపై మెడికో ఆత్మహత్య

## కారులో ఆత్మహత్య చేసుకున్న పీజీ వైద్య విద్యార్థి



హైదరాబాద్,ఫిబ్రవరి13 : కుటుంబాల్లో మన స్పర్థలతో కొందరు, అనారోగ్యం, పేదరికం, అప్పులబాధతో మరికొందరు, నిరుద్యోగం, పరీక్షల్లో ఫెయిల్.. ప్రేమలో విఫలం. ఇష్టం లేని పెళ్లితో ఇంకొందరు.. వరకట్న వేధింపులు,.అవమానం, డిప్రెషన్ ఇలా కారణాలు ఏదైతేనేం. క్షణికావేశంలో తిరిగి రాని లోకాలకు వెళ్లిపోతున్న వారి సంఖ్య రోజు రోజుకీ పెరుగుతూనే ఉంది తప్ప తగ్గడం లేదు. తాజాగా పీజీ వైద్య విద్యార్థిని లక్ష్మీ రచనారెడ్డి(25) ఔటర్ రింగ్‌రోడ్డుపై కారులో ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపుతోంది. ప్రాణాంతక ఇంజక్షన్ తీసుకోవడం వల్లే ఆమె మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం కాలనీలో నివాసముండే 26ఏళ్ల డాక్టర్ లక్ష్మీరచనారెడ్డి అనే మహిళ.. బాచుపల్లి మమత వైద్య కళాశాలలో పీజీ గైనకాలజీ ఇంటర్న్‌షిప్ చేస్తోంది. ఆమె తండ్రి మోతె ప్రకాష్‌రెడ్డి వ్యాపారి. రోజూ ఆమె కాలేజీకి కారులో వెళ్లి వచ్చేది. సోమవారం ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయలుదేరిన రచనా ఔటర్ రింగ్‌రోడ్డుపై కారు పక్కకి నిలిపి.. డ్రైవింగ్ సీట్లోనే ఇంజక్షన్ తీసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లారు. కిష్టారెడ్డిపేట గ్రామ శివారులోని ఔటర్‌రింగ్ రోడ్డుపై కారులో ఓ యువతి అపస్మారక స్థితిలో ఉందని అమీన్‌పూర్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న లక్ష్మీరచనారెడ్డిని ఆమె చదువుకుంటున్న మమత ఆస్పత్రికే తరలించారు. ఆమె ప్రాణాలుకాపాడేందుకు డాక్టర్లు ప్రయత్నించినప్పటికీఫలితం లేకుండా పోయింది. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందింది. ప్రాణాంతక ఇంజక్షన్ తీసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. పోస్టుమార్టంనిమిత్తంమృతదేహాన్ని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలి ంచి.. ఆత్మహత్యకు గల కారణాలను తెలుసు కునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తు న్నారు. రచనారెడ్డి అపస్మారక స్థితిలో ఉన్నపుడు కారులో డ్రైవర్ సీటులో సీటుబెల్ట్ పెట్టుకుని ఉందని, చేతికి కాన్యులా ఉం డటంతో పాయిజన్ తీసుకుని ఉంటుందని భావిస్తున్నారు.

# సుదీర్ఘ నిరసనకు సిద్ధమైన రైతులు

## రైతులపై బాష్పవాయువు ప్రయోగం

## రాజధాని సరిహద్దుల్లో భారీ ట్రాఫిక్‌జామ్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి13 : తమ డిమాండ్లను నెరవేర్చుకునే లక్ష్యంతో మంగళవారం దేశ రాజధాని ఢిల్లీ దిశగా అన్నదాతలు కదిలారు. ఈ ఉదయం పంజాబ్, హరియాణా నుంచి వేలాదిమంది రైతులు ట్రాక్టర్లతో నగరానికి బయల్దేరారు. ఈ క్రమంలో కొన్ని కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన నిఘా నివేదిక ప్రకారం.. ఒక్క పంజాబ్నుంచే వందల సంఖ్యలో ట్రాక్టర్లు, వాహనాలు బయల్దేరతాయని, వాటిలో అన్నదాతలు ఆరు నెలలకు సరిపడా ఆహారం, ఇతర సామగ్రిని తీసుకువస్తారని తెలిపింది. కొందరు రైతులు మీడియాతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వం, పోలీసులు తమ సహనానికి పరీక్ష పెట్టినా డిమాండ్లు నెరవేరేవరకు నిరసన కొనసాగిస్తామన్నారు. 'సుత్తి, రాళ్లను పగలకొట్టే పరికరాలతో సహా కావాల్సినవన్నీ మా ట్రాలీల్లో ఉన్నాయి. ఆరు నెలలకు సరిపడా రేషన్, డీజిల్‌తో మేం మా ప్రాంతాల నుంచి బయలుదేరాం' అని ఓ రైతు మీడియాకు వెల్లడించారు. ఆయన రెండు ట్రాలీల్లో సామగ్రిని తీసుకొని పంజాబ్‌లోని గురుదాస్‌పుర్ నుంచి దేశ రాజధానికి వస్తున్నారు. తమ యాత్రను భగ్నం చేసేందుకు ట్రాక్టర్లకు డీజిల్ దొరక్కుండా చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. 2020-21లో ఉద్యమించిన రైతులు పలువురు ప్రస్తుత ఆందోళనలో పాల్గొంటున్నారు. అప్పట్లో వారు కొన్ని నెలల పాటు ఢిల్లీలో చలిని లెక్క చేయకుండా నిరసన చేపట్టారు. హామీ ఇచ్చినట్టుగా కేంద్రం తమ డిమాండ్లను నెరవేర్చలేదని, ఇప్పుడు వాటిని సాధించుకున్నాకే తిరిగి వెనక్కివెళతామని వారు స్పష్టంచేశారు. కాగా రైతులు తలపెట్టిన మెగా మార్చ్‌లో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పంజాబ్, హరియాణా మధ్య ఉన్న శంభు సరిహద్దు వద్దకు భారీ సంఖ్యలో వచ్చిన రైతులపై పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. ఢిల్లీ దిశగా కదులుతున్న వారిని అడ్డుకునేందుకు ఈ చర్యలు తీసుకున్నారు. దీంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. బాష్పవాయువు ప్రయోగంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. అలాగే బలగాలు డ్రోన్లతో స్మోక్ బాంబ్స్‌ను జారవిడిచారు. దీంతో నిరసనకారులు, మీడియా ప్రతినిధులు పరుగులుపెట్టినట్లు తెలుస్తోంది. ఆందోళనకారులు వారి ప్రణాళిక ప్రకారం 'ఢిల్లీ చలో' మార్చ్‌ను ప్రారంభించారు. ఈ క్రమంలోనే పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లను వారు బద్దలుకొట్టేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు వారిని అడ్డుకునేందుకు టియర్‌గ్యాస్ ప్రయోగించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఉదయం 10 గంటలకు పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహిబ్ నుంచి వేలాదిమంది రైతులు ట్రాక్టర్లతో ఢిల్లీ కి బయల్దేరారు. అటు సంగ్రూర్ నుంచి మరో బృందం కూడా ఇంద్రప్రస్థ దిశగా కదిలింది. ఈ సందర్భంగా కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ జనరల్ సెక్రటరీ శర్వణ్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ.. "మేం బారికేడ్లను బద్దలుకొట్టాలనుకోవడం లేదు. చర్చలతోనే మా సమస్యను పరిష్కరించుకోవాలని భావిస్తున్నాం. కానీ, వారు (కేంద్రం) మాకు ఏ విధంగా సాయం చేయట్లేదు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ర్యాలీ మొదలుపెట్టాం. రోడ్లను బ్లాక్ చేస్తామని మేం చెప్పలేదు. ప్రభుత్వమే అలా చేస్తోంది. పంజాబ్, హరియాణా సరిహద్దులు అంతర్జాతీయ సరిహద్దుల్లా కన్పిస్తున్నాయి" అని అన్నారు. రైతుల ఆందోళనను భగ్నం చేసేందుకు పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నగర సరిహద్దుల్లో భారీగా బలగాలను మోహరించారు. రహదారులపై బహుళ అంచెల్లో బారికేడ్లు ఏర్పాటుచేశారు. పలు చోట్ల కాంక్రీట్ బ్లాక్స్, ఇనుప కంచెలు, మేకులను అడ్డుగా పెట్టారు. ఢిల్లీ అంతటా నెల రోజుల పాటు 144 సెక్షన్ విధించారు. ముందు జాగ్రత్తగా పార్లమెంట్ సమీపంలో ఉన్న సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్‌ను మూసివేశారు.సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. గాజీపుర్, చిల్లా సరిహద్దుల్లోని హైవేలపై కిలోమీటర్ల మేర వాహనాలు బారులుతీరాయి. ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. కిలోమీటరు దూరానికే గంటకు పైగా సమయం పడుతుండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు, అన్నదాతల ఆందోళనను అడ్డుకునేందుకు కేంద్రం పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే రైతులను నిర్బంధించేందుకు వీలుగా ఢిల్లీలోని బావనా ప్రాంతంలో తాత్కాలిక జైలుగా ఏర్పాటు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. దీన్ని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తోసిపుచ్చారు. రైతన్నలను జైల్లో పెట్టడం సరికాదన్నారు. ఈ ఆందోళనపై కేంద్రం, రైతుల మధ్య సోమవారం అర్ధరాత్రి వరకు జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాల్సిందేనని రైతు నాయకులు చేసిన డిమాండ్‌పై ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో రైతులు ఆందోళన ప్రారంభించారు. ఇదిలా ఉంటే..'ఢిల్లీ చలో' ఆందోళన ఎలా చేపట్టాలన్న దానిపై రైతు సంఘాలు రిహార్సల్ నిర్వహించాయని, కొందరు రైతులు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా సహా పలువురు భాజపా సీనియర్ నేతల ఇళ్ల ముందు నిరసన చేపట్టే అవకాశాలున్నాయని ఆ నిఘా నివేదిక పేర్కొన్న సంగతి తెలిసిందే.

# మేడిగడ్డ నిర్మాణంలో ఎన్నో లోపాలున్నాయి

మేడిగడ్డ బ్యారేజ్ ను కళ్లారా చూశాకే.. నివేదికపై చర్చిస్తామన్నారు. కేసీఆర్ కూడా మేడిగడ్డకు రావాలని.. ఆయన కోసం ప్రత్యేకంగా హెలికాప్టర్ ను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. హరీష్ రావు కూడా మేడిగడ్డకు రావాలని కోరుతున్నామన్నారు.రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. మేడిగడ్డలో అసలేం జరిగిందో ప్రజలకు నిజాలు తెలియాలన్నారు. డ్యామ్ డిజైన్ లో చాలా తప్పులున్నాయి. కాంగ్రెస్ హయాంలో కట్టిన పలు ప్రాజెక్టులు ఇప్పటికీ దృఢంగా ఉన్నాయని, ఇటీవల కట్టిన ప్రాజెక్టులు ఎందుకు కుంగిపోతున్నాయని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని, అలాంటి ప్రాజెక్టులను సరిగ్గా నిర్మించనిపక్షంలో నష్టపోయేది మనమేనన్నారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఖజానా డబ్బు చాలా వృథా అయిందని, ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులను నిర్మించి.. అభివృద్ధి చేశామని ప్రజల్ని మోసం చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని పెద్దలు చెప్పారని సీఎం రేవంత్‌రెడ్డితెలిపారు. దేవాలయాలు ఎంత పవిత్రమైనవో.. రైతులకు ప్రాజెక్టులూ అంతేనని చెప్పారు. ఐదో రోజు అసెంబ్లీ సమావేశాల్లో స్వల్పకాలిక చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడారు."తెలంగాణకు ప్రధానంగా తాగు, సాగునీటి కోసం రెండు వనరులున్నాయి. అవి కృష్ణా, గోదావరి జలాలు. కృష్ణా జలాలపై ఇప్పటికే కొంత మేర శాసనసభలో చర్చించాం. వాస్తవాలను రాష్ట్ర ప్రజలకు వివరించగలిగాం. ఇక రెండోది గోదావరి జలాలు. తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టాలని గతంలో పాలకులు నిర్ణయం తీసుకున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. రూ.38,500 కోట్ల అంచనాతో 2008లో టెండర్ల ప్రక్రియ చేపట్టారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటయ్యే నాటికే వేల కోట్ల రూపాయల విలువైన పనులు జరిగాయి.భారాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల రీడిజైన్ అనే బ్రహ్మపదార్థాన్ని కనిపెట్టారు. తుమ్మిడిహట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టులో మార్పులు చేర్పులు చేసి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల.. ఇలా బ్యారేజీలు కట్టుకుంటూపోయారు. చివరకు రూ.38,500 కోట్ల అంచనాతో ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రూ.1.47 లక్షల కోట్లకు పెంచారు. భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉంది. అంచనాలు ఎలా పెంచారు? రీడిజైనింగ్ ఎలా చేశారు? అందులో సాంకేతికపరమైన అంశాలు ఏమున్నాయి? రీడిజైనింగ్‌కు సంబంధించి నిపుణులు ఇచ్చిన డీపీఆర్ ఎక్కడ?ఆ తర్వాత జరిగిన నిర్మాణం, నిర్వహణ.. ఇవన్నీ ఇప్పటికీ ప్రశ్నల్లాగే మిగిలాయి.మేడిగడ్డ బ్యారేజీ కింద ఇసుక కదలడం వల్లే కుంగిపోయిందని గత ప్రభుత్వంలో నేతలు అన్నారు. రూ.వేల కోట్లు ఖర్చు చేశారు. ఇంత జరిగితే.. బ్యారేజీ వద్దకు ఎవరూ వెళ్లకుండా.. చూడనీయకుండా పోలీసు పహారా పెట్టారు. భారత్-పాక్ సరిహద్దు వద్ద కూడా ఆ స్థాయిలో సెక్యూరిటీ ఉంటుందని నేను అనుకోవడం లేదు. ఫిర్యాదులు అందడంతో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ప్రాజెక్టు పరిస్థితి ఏంటనే వివరాలతో కూడిన నివేదికను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చింది. చివరకు ఆ నివేదికనూ గత ప్రభుత్వం తప్పుబట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. మేడిగడ్డ వద్ద జరుగుతున్న పరిస్థితుల నేపథ్యంలో కొంతమంది అధికారులు కార్యాలయాల నుంచి ఫైళ్లు మాయం చేశారని పెద్ద ఎత్తున టీవీలు, పత్రికల్లో వచ్చింది. దీంతో తక్షణమే మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వద్ద జరిగిన అవకతవకలపై విచారణకు ఆదేశించాం. విజిలెన్స్ కమిటీ ప్రాథమికంగా ఓ నివేదిక ఇచ్చింది. బ్యారేజీ నిర్మాణంలో తీసుకున్న నిర్ణయాలు, నిర్వహణలో నిర్లక్ష్యం సహా అనేక విషయాలను అందులో ప్రస్తావించింది.ఇప్పటికీ బ్యారేజీ వద్ద ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. కొంతమంది సీనియర్లు ఉన్నప్పటికీ వారికి పూర్తి అవగాహన ఉందో లేదో తెలియదు. అందుకే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరినీ బ్యారేజీ సందర్శనకు రావాలని కోరాం.

# ఎన్నికల వేళ తెలుగు రాష్ట్రాలలో పెరిగిన ఉత్కంఠ

2024 సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరవడుతోంది. సర్వే రిపోర్టులతో దేశమంతా ఎన్నికల వేడి రాజుకుంది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఉత్కంఠ మొదలైంది. టీడీపీ, టీఆర్ఎస్ లు అతి పెద్ద పరీక్షను ఎదుర్కోబోతున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ లోని అధికార వైసీపీకి కూడా ఈ ఎన్నికలు పరీక్ష పెడుతున్నాయి. పవన్ కల్యాణ్ జనసేన భవిష్యత్‌ని తేల్చే ఎన్నికలు ఇవి. అయితే గాలి ఎటువైపు వీస్తుందో ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. అయితే, తమ పరిస్థితికి అనుగుణంగా ఎ.పి లో పార్టీల ఎంఎల్ఎలు, ఎంపిలు అటూ ఇటూ మారుతున్నారు. ఇక తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీ మనుగడకు వచ్చే లోక్‌సభ ఎన్నికలు పరీక్ష పెడుతున్నాయి. ఎన్నికల నాటికి ఆ పార్టీలో ఎంతమంది ఎమ్మెల్యేలు..సిట్టింగ్ ఎంపీలు ఉంటారో తెలియని పరిస్థితి.. ఇప్పటికైతే బిఆర్ఎస్ నుంచి ఒక ఎంపీ కాంగ్రెస్ గూటికి చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలవడం రేవంత్‌కు అనివార్యం. కాబట్టి బీఆర్ఎస్‌ను ఎంత బలహీన పరిస్తే ఆయన పని అంత సులువు అవుతుంది. ఇక ఏపి లో చంద్రబాబు నాయుడుకు ఇది అతి పెద్ద పరీక్షా సమయం. మరోవైపు జగన్ అధికారాన్ని కాపాడుకునేందుకు పథక రచన చేస్తున్నారు. బాబు 'రా కదిలిరా' అంటే.. జగన్ 'సిద్ధం' అంటూ యుద్ధం ప్రకటిస్తున్నారు. చంద్రబాబుతో పొత్తు పెట్టుకున్న పవన్ కళ్యాణ్ శాసనసభలోకి ప్రవేశించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. మరోవైపు, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హస్తం పార్టీని తిరిగి పట్టాలెక్కించే ప్రయత్నంలో ఉన్నారు. అందుకు వచ్చే ఎన్నికలు ఆమెకు మంచి అవకాశం. ఇప్పటికిప్పుడు సీట్లు గెలవకపోయినా కాంగ్రెస్ ఉనికిని ప్రదర్శిస్తే షర్మిల సక్సెస్ అయినట్టే. ఇక ఈ ఎన్నికల్లో బీజేపీ ఏ పార్టీ వైపు వెళ్లాలో ఆచి తూచి అడుగులు వేస్తోంది. నిన్నటి మొన్నటి వరకు వైసీపీకి 24 ఎంపీ సీట్లు ఖాయం అనే పరిస్థితి ఉంది. కానీ ఇప్పుడు టీడీపీ వైపు మొగ్గు చూపిస్తున్నాయి సర్వేలు. దాంతో బీజేపీ కూడా టీడీపీ తో పొత్తు పట్ల విముఖ ప్రదర్శించే పరిస్థితిలో లేదు. అంతేగాక బీజెపితో జట్టు కట్టడం కోసం చంద్రబాబు నాయుడు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. 2018లో ఎన్నికల ముందు ప్రత్యేక హోదా బదులు ప్యాకేజీకి ఒప్పుకున్న చంద్రబాబు చివరలో బిజెపి నుంచి విడిపోవడం, ఎన్‌డిఎ నుంచి బయటకు రావడం కేవలం ప్రజలను నమ్మించడానికేనని అందరికీ తెలుసు. అయినా టీడీపీ బాబు ఘోరంగా ఓడిపోయింది. ఎన్నికల తరువాత బిజెపిని ఏనాడూ విమర్శించలేదు. ఇక పవన్ కళ్యాణ్ కూడా ఇలాగే వ్యవహరించారు. మోడీ, అమిత్‌షాల పట్ల అనుక్షణం విధేయత ప్రకటిస్తూ వచ్చారు. మరోవైపు ముఖ్యమంత్రి జగన్ తనపై ఉన్న కేసుల రీత్యా మోడీకి వంత పాడటం మినహా చేసేదేమీ లేదు. మోడీ సర్కార్‌కు పూర్తి మెజార్టీ వుండటంతో జగన్‌కు ఈ పరిస్థితి వచ్చింది. ఏదేమైనా ఏపీ లోని మూడు ప్రాంతీయ పార్టీలూ తమ ప్రయోజనాల కోసం మోడీ జపం చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను ఘోరంగా దెబ్బతీస్తున్నారనేది ప్రజలకు తెలియంది కాదు. నిజానికి బీజేపీ గత ఎన్నికల్లో 0.96 శాతం అంటే ఒక శాతం కన్నా తక్కువ ఓట్లు వచ్చాయి. అలాంటి బిజెపితో పొత్తు ఎందుకంటే అది కేంద్రంలో అధికారంలో ఉండటమే. ఎవరెటు పోయినా బీజేపీకి తన ప్రయోజనాలే ముఖ్యం. మరి కొద్ది రోజుల్లో కమలం పార్టీ తన వైఖరిని స్పష్టం చేయవచ్చు. అప్పుడు కానీ ఏపీ రాజకీయాలు మరింత రంజుగా మారతాయి. తెలంగాణలోనూ కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య బీజేపీ తన లాభాన్ని వెతుక్కుంటోంది. బీఆర్ఎస్ ఇప్పుడు బీజేపీని పల్లెత్తు మాట అనటంలేదు. కేవలం కాంగ్రెస్ పార్టీనే లక్ష్యంగా చేసుకుంది. ఇక సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి బిఆర్ఎస్ నే టార్గెట్ చేశారు. ముందు బీఆర్ఎస్‌ని బలహీన పరచి ..ఎన్నికల నాటికి బీజేపీపై దాడిని తీవ్రం చేయాలనేది కాంగ్రెస్ ఎత్తుగడగా కనిపిస్తోంది.



# ప్రాజెక్టుల పేరుతో దోచుకున్నారు

- కాళేశ్వరంకోసం రూ.లక్ష కోట్లు ఖర్చు
- లక్ష ఎకరాలకు కూడా నీరు అందలేదు
- నిర్మాణంలో నాణ్యతాలోపం ఉంది
- డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెప్పినప్పటికీ చక్కదిద్దలేదు
- ప్రాజెక్టుకు ఏటా విద్యుత్ బిల్లులే రూ.10,500 కోట్లు
- మేడిగడ్డను ఎవరూ చూడకుండా కేసీఆర్ కప్పిపుచ్చారు
- రీడిజైన్ పేరుతో కాళేశ్వరం చేపట్టి భారీగా అవినీతి
- ప్రజా కోర్టులో చర్చిద్దామని ఆహ్వానించాం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



మహదేవపూర్,ఫిబ్రవరి13 : కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టినా లక్ష ఎకరాలకు కూడా నీరు అందలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న ఏడో బ్లాక్‌లోని పియర్స్‌ను మంగళవారం సాయంత్రం ప్రజాప్రతినిధుల బృందం పరిశీలించింది. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు స్థితిగతులపై ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గతేడాది అక్టోబరు 21న మేడిగడ్డ పిల్లర్లు కుంగాయని ఇంజినీర్లు వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. లక్ష ఎకరాలకు నీరు అందక పోయినా.. కేసీఆర్ మాత్రం కోటి ఎకరాలకు నీరు ఇచ్చామని గొప్పలు చెప్పారని విమర్శించారు. నిర్మాణంలో నాణ్యతాలోపం ఉందని డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెప్పినప్పటికీ.. సమస్యను చక్కదిద్దే పని చేయకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఏటా విద్యుత్ బిల్లులే రూ.10,500 కోట్లు వస్తున్నాయని తెలిపారు. ప్రాజెక్టు రుణాలు, ఇతర ఖర్చులు కలిపి ఏటా రూ.25వేల కోట్లు అవసరమవుతాయని వివరించారు. "కుంగిన మేడిగడ్డను ఎవరూ చూడకుండా కేసీఆర్ కప్పిపుచ్చారు. ఈసీ అనుమతి పొంది రాహుల్ గాంధీ, నేను మేడిగడ్డను పరిశీలించాం. జరిగిన అవకతవకలపై నీటిపారుదల శాఖ మంత్రి విచారణకు ఆదేశించారు. కాళేశ్వరం నిర్మాణం, నిర్వహణలో భారీగా లోపాలు ఉన్నాయని విజిలెన్స్ కమిటీ చెప్పింది. రీడిజైన్ పేరుతో కాళేశ్వరం చేపట్టి భారీగా అవినీతికి పాల్పడ్డారు. తన బండారం బయటపడుతుందని కేసీఆర్ గ్రహించారు. అవినీతి బయటపడకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే నల్గొండలో సభ పెట్టారు. చావు నోట్లో తల పెట్టానని కేసీఆర్ పదే పదే అంటున్నారు. అలా అని భావించే ప్రజలు రెండుసార్లు అవకాశం ఇచ్చారు. ప్రజలు రెండుసార్లు అవకాశం ఇస్తే.. ప్రాజెక్టుల పేరుతో దోచుకున్నారు. కాళేశ్వరంపై ప్రజల అనుమానాలు నివృత్తిచేయాలని ప్రభుత్వం భావించింది. శాసనసభ, ప్రజా కోర్టులో చర్చిద్దామని ఆహ్వానించాం. కాలు విరిగిందని శాసనసభకు రాలేని కేసీఆర్.. నల్గొండ సభకు ఎలా వెళ్లారు. కేసీఆర్ దోపిడీకి కాళేశ్వరం బలైపోయింది. అడిగితే సలహాలు ఇస్తానన్న కేసీఆర్ ..కేఆర్ఎంబీపై చర్చ పెడితే అసెంబ్లీకి ఎందుకు రాలేదు. సభలో చేసిన తీర్మానం చక్కగా లేదని విమర్శిస్తున్నారు. అలాంటి తీర్మానానికి హరీశ్‌రావు ఎందుకు మద్దతిచ్చారు. ఆయన మాటలకు విలువ లేదా? కేసీఆర్ బెదిరించి బతకాలని చూస్తున్నారు. సీఎం కుర్చీ పోగానే.. నీళ్లు, ఫ్లోరైడ్ బాధితులు గుర్తొచ్చారా? కాలు విరిగిందని సాను భూతితో ఓట్లు పొందాలని చూస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు వచ్చేందుకు కేసీఆర్ ఎందుకు భయపడుతున్నారు. రూ.వేల కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు కుంగితే చిన్న విషయంగా మాట్లాడుతున్నారు. ఏముంది చిన్న పిల్లర్లు కుంగాయని తేలికగా మాట్లాడుతున్నారు. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించింది కేసీఆరే. ప్రాజెక్టులను కేంద్రం నిర్వహించేందుకు గత ప్రభుత్వం నిధులు కూడా ఇచ్చింది. సాగునీటి శాఖపై అసెంబ్లీలో శ్వేతపత్రం పెడతాం.. కేసీఆర్ వచ్చి మాట్లాడాలి. ప్రజల కోసం బయటికి వెళ్లే అలవాటు కేసీఆర్‌కు ఏనాడూ లేదు. ఎంపీ ఎన్నికల్లో కొన్ని ఓట్లు తెచ్చుకునేందుకు కొత్త ఎత్తుగడ ఎత్తుకున్నారు" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరారవుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నేతలు ప్రాజెక్టును పరిశీలించిన వారిలో ఉన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ వంతెన కుంగిందని వార్తలు రాగానే తొలుత బీఆర్ఎస్ నేతలు స్పందించలేదు. ఏమీ పట్టనట్టు వ్యవహరించారు. ఆ ప్రాజెక్టుకు ఏమీ నష్టం జరగలేదని అన్నట్టు కిమ్మనకుండా ఉన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం మొదలుపెట్టిన రోజు కాళేశ్వరంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. ఆ సమయంలో రేవంత్ రెడ్డి అదే విషయాన్ని పదేపదే ప్రస్తావించారు. ఆ తర్వాత అన్నారం బ్యారేజ్ లో డ్యామేజ్ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోనికి అన్ని బ్యారేజ్ లది ఇదే పరిస్థితి అని నాడు కాంగ్రెస్ నేతలు మొత్తుకున్నారు. ఎన్నికల సమయంలో మేడిగడ్డ అంశంపై హాట్ టాపిక్ గా ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడటం వల్లే ప్రాజెక్టులకు ఈ పరిస్థితి దాపురించిందని రేవంత్ రెడ్డి అనేకసార్లు విమర్శించారు. అప్పటి సీఎం కేసీఆర్ సరైన శ్రద్ధ పెట్టకపోవడం వల్లే ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిపై విచారణ చేయిస్తామని హెచ్చరించారు. తొలుత సైలెంట్ గా ఉన్న బీఆర్ఎస్ నేతలు ఆ తర్వాత మేడిగడ్డపై స్పందించారు. బ్యారేజ్ కు డ్యామేజ్ జరగలేదని అప్పటి మంత్రి హరీశ్ రావు సన్నాయి నొక్కులు నొక్కారు. రెండు పిల్లర్ల మధ్య ఉండే గ్యాప్ ను చూసి పగుళ్లు అని ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలపై ఎదురుదాడికి దిగారు. సోషల్ మీడియాలో ఫేక్ ఫోటోలు పెట్టి కాంగ్రెస్ నేతలను హేళన చేసే ప్రయత్నం చేశారు.

# కారుణ్య నియామకాలపై ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం

హైదరాబాద్,ఫిబ్రవరి13 : కారుణ్య నియామకం కింద తెలంగాణా వాసులకు ఉద్దేశించిన ఉద్యోగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారిని నియమించడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన సందర్భంగా ఆమె ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. స్థానికులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, దాని ప్రకారం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టాలు కూడా చేసిందన్నారు. అయితే, కొత్త కాంగ్రెస్ హయాంలో, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన ఎ రామిరెడ్డి కుమారుడు ఎ రఘునాథ్ రెడ్డికి పాత ప్రభుత్వ ఉత్తర్వును ఉపయోగించి కారుణ్య ప్రాతిపదికన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ విభాగంలో ఉద్యోగం ఇచ్చారు.రఘునాథ్‌రెడ్డి పాఠశాల విద్యాభ్యాసం అంతా కర్నూల్‌లోనే జరిగిందని, అతను తెలంగాణ వ్యక్తి కాకపోయినప్పటికీ 2007 జూలై 12న ఇచ్చిన జీవోను కోట్ చేస్తూ కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. అప్పటికి రాష్ట్రం కలిసే ఉందని, 2014 తర్వాత మన రాష్ట్ర అవసరాలకు తగ్గట్లుగా ఎన్నో నిబంధనలు మారాయని ఆమె చెప్పారు. అలాంటప్పుడు రఘునాథ్‌రెడ్డికి కంపాషనేట్ అపాయింట్‌మెంట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇది చాలా దారుణమని, తెలంగాణ ప్రాంత బిడ్డలకు ఉద్యోగాల్లో అన్యాయం జరిగితే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ బిడ్డల పొట్ట కొట్టొద్దని కోరారు. ఈ సందర్భంగా అక్రమ నియామకం విషయాన్ని లేఖ రూపంలో మండలి చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ.. ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. అయితే సమస్యను పరిశీలించి అవసరమైతే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# కట్టె కాలే వరకు పులిలా పోరాడుతా

- చివరిశ్వాస వరకు పులిలా కొట్లాడతా
- బతుకనివ్వం.. వెంటపడుతం.. వేటాడుతం..!
- కాంగ్రెస్ సర్కారుకు కేసీఆర్ హెచ్చరిక

నల్లగొండ,ఫిబ్రవరి13 : నల్లగొండ వేదికగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కే చంద్రశేఖర్ రావు కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. పదవులు శాశ్వతంకాదు.. తెలంగాణ ప్రజల హక్కులు శాశ్వతం.. అధికారం ఉన్నా లేకున్నా ప్రజల పక్షానే ఉంటాం.. అంటూ కేసీఆర్ పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోరుతూ బీఆర్ఎస్ పార్టీ నల్లగొండలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్‌కు వార్నింగ్‌లు ఇచ్చారు గులాబీ బాస్. ఇచ్చిన హామీలు అమలు చేయా ల్సిందేనని అప్పటిదాకా వెంటపడి కొట్లాడుతామన్నారు. వేటాడుతామన్నారు. రైతు బంధు నుంచి పంట బోనస్‌ల దాకా దేన్నీ వదలబోమన్నారు. తెలంగాణకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని.. చివరిశ్వాస వరకు పులిలా కొట్లాడతా అంటూ కేసీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు పదవులు తప్ప ప్రజల సమస్యలు పట్టవంటూ విమర్శించారు. రైతులను చెప్పుతో కొడుతావా..? తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌నే తిరగనివ్వరా..? ఎన్ని గుండెలు మీకు అంటూ కేసీఆర్ కాంగ్రెస్ పై ధ్వజమెత్తారు. ప్రజలకు తన మీద ఏం కోపం వచ్చిందో తెలియదు కానీ.. పాలిచ్చే ఆవును వదిలేసి దున్నపోతును తెచ్చుకున్నారని కేసీఆర్ కామెంట్ చేశారు. తెలంగాణ వచ్చిన తరువాత విద్యుత్ కోతలు లేకుండా చూశామని కేసీఆర్ అన్నారు. తాము అధికారం నుంచి దిగిపోయిన వెంటనే కరెంట్ కోతలు మొదలయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని గులాబీ బాస్ మండిపడ్డారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. తెలంగాణ హక్కులు శాశ్వతమని అన్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టాలన్న వారిని చెప్పుతో కొట్టాలని కేసీఆర్ అన్నారు. ఇష్టమొచ్చినట్టు మాట్లాడవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మేడిగడ్డ దగ్గర ఇప్పటికీ నీళ్లు ఉన్నాయని.. దమ్ముంటే వాటిని రైతులకు అందివ్వాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే ఆటబొమ్మ కాదని అన్నారు. రెండు మూడు పిల్లర్లు కుంగిపోతే వాటిని సరి చేయాలని సూచించారు. కృష్ణా నదిలో తెలంగాణ వాటా తేలేవరకు పోరాటం చేయాల్సిందేనని అన్నారు కేసీఆర్. అందుకే నల్లగొండలో సభ పెట్టానని అన్నారు. ఇది రాజకీయ సభ కాదన్నారు. ఒకప్పుడు ఆముదాలు, బత్తాయి తోటలతో బతికిన నల్లగొండ జిల్లాలో లక్షల టన్నుల వడ్లు పండించే స్థితికి తీసుకొచ్చామని అన్నారు కేసీఆర్. ఆ పంటలకు నీళ్లు ఎలా ఇచ్చామో తెలుసుకోవాలని అన్నారు. ప్రజలు ఉద్యమించకపోతే ఎవరూ మనల్ని రక్షించరని అన్నారు కేసీఆర్. ఓట్లు ఉన్నప్పుడే కొందరు వస్తారని.. ఆ తరువాత ఎవరూ పట్టించుకోరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. తమకు ఎవరూ సహకరించకున్నా.. ఈ ప్రాజెక్టును 80 శాతం పూర్తి చేశామని తెలిపారు. నల్లగొండ సభలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఒకప్పుడు ఫ్లోరైడ్‌తో అల్లాడిపోయిన నల్లగొండ జిల్లాను ఎవరూ పట్టించుకోలేదని.. తెలంగాణ, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత నల్లగొండ జీరో ఫ్లోరైడ్‌గా మారిందని అన్నారు. కేసీఆర్‌ను తిరగనివ్వమంటున్నారు.. అంత మొనగాళ్లా? మీకు దమ్ముంటే మాకంటే గొప్పగా పాలించి చూపించండి. మేడిగడ్డకు వెళ్లి ఏం చేశారు.. అసెంబ్లీ అయ్యాక మేమూ వెళ్తాం. ఇప్పుడు కూడా ప్రాణహితలో 5వేల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. దమ్ముంటే.. ప్రాణహితలో నీటిని ఎత్తిపోయాలి. కేసీఆర్‌ను బద్నాం చేయాలని .. పొలాలు ఎండబెడతారా? కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక ఆటబొమ్మకాదు. ప్రాజెక్టులో 200 కి.మీ సొరంగాలు, 1500 కి.మీ కాల్వలు ఉంటాయి. రెండు మూడు పిల్లర్లు కుంగిపోయాయన్నది వాస్తవమే. ఎన్నిసార్లు ఇలా పిల్లర్లు కుంగిపోలేదు.. సాగర్‌లో కుంగలేదా? రైతు బంధు అడిగితే చెప్పుతో కొడతానంటారా.. ఎన్ని గుండెలు మీకు. మంత్రులకు అంత కండకావరమా.. కళ్లు నెత్తికెక్కాయా? పంటలు పండించే రైతులకు కూడా చెప్పులు ఉంటాయి. రైతు చెప్పుతో కొడితే మూడు పళ్లు రాలిపోతాయి. మీకు చేతకాకపోతే.. చేతకాదని చెప్పాలి" అని కేసీఆర్ అన్నారు. భారాస నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, కేశవరావు తదితరులు సభలో పాల్గొన్నారు. కొన్ని నెలల విరామం తర్వాత ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కేసీఆర్‌కు పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తెలివిలేక.. ప్రభుత్వాన్ని నడిపే చేతగాక మందిమీద బద్నాంపెట్టి బతుకుదామనుకుంటున్నారా? అట్లగాదు బిడ్డా జాగ్రత్తా..! బతుకనివ్వం.. వెంటపడుతం.. వేటాడుతాం అంటూ అధికార కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖరావు హెచ్చరించారు. ఛలో నల్లగొండ సభలో కాంగ్రెస్ సర్కారు పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్రం వచ్చాక కరెంటు తెచ్చాం. ఏడెనిమిది నెలల్లో కరెంటు బాగు చేసి ఏడాదిన్నర నుంచి 24గంటల కరెంటు రైతాంగానికి ఇచ్చాం. మీరంతా సంతోషంగా నడింట్లో పండుకొని పంటలు పండించారు. పాములు, తేళ్లు కరువంగా బాయిలకాడికి పోలే. కేసీఆర్ గవర్నమెంట్ పోంగనే కట్టేసినట్టే బంద్ అవుతుందా కరెంటు? నేను తొమ్మిదేళ్లు ఇచ్చిన కరెంటు దానికి ఏం రోగం అయ్యింది.. మాయ రోగం వచ్చిందా? యాడపోయే కరెంటు' అంటూ మండిపడ్డారు. 'దద్దమ్మల రాజ్యం ఉంటే గట్లనే ఉంటది. చాతగాని చవటల రాజ్యం ఉంటే గట్లనే ఉంటది. వాళ్లు ఉన్నంత మాత్రాన మనం నర్వస్ కావొద్దు. ఎక్కడికక్కడ మనం నిలదీయాలి. ఏమైందిరా బిడ్డ నా కరెంటు అని అడగాలి. ఇవాళ నేను ఒక మాట కుల్లకుల్లగా చెబుతున్న. మొన్నటిదాకా నడిచిన కరెంటు కాకుండా.. ఇదే మిర్యాలగూడ నియోజకవర్గంలో దామరచర్ల మండలంలో 4వేల మెగాపవర్ ప్లాంట్ కట్టినం జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో. 90శాతం పనులు పూర్తయ్యాయి. రెండుమూడు నెలలు తిప్పలుపడితే 4వేల మెగావాట్ల పవర్ వస్తుంది. రామగుండంలో ఆ నాడు మొదలుపెట్టిన ఎన్టీపీసీ 800 మెగావాట్ల పవర్ వచ్చింది. ఇంకో 800 మెగావాట్లు రాబోతున్నది. ఆ నాడు నడిపిన నాడు ఉన్నదాని కంటే 5600 మెగావాట్ల పవర్ కరెంటు ఎక్కువగ ఉండంగ కూడా.. వీళ్లకు ఏం రోగం పుట్టింది.. కరెంటు ఎందుకు ఇస్తలేరు ? ఎందుకు తిప్పలుపెడుతున్నరు ? బిడ్డా ఛలో నల్లగొండతోనే ఆపం. ఎక్కడ దొరికితే అక్కడ బజార్లలో నిలదీస్తాం' అని స్పష్టం చేశారు. 'ప్రజలను కరెంటుకు తిప్పలు పెట్టినా.. నీళ్లకు తిప్పలుపెట్టినా.. మంచినీళ్లకు తిప్పలుపెట్టినా ఎక్కడికక్కడ మిమ్మల్ని నిలబెడుతాం. మీకు గవర్నమెంట్ ఇచ్చారు. మాకు ప్రతిపక్షం బాధ్యత ఇచ్చారు. మిమ్మల్ని నిలదీసే బాధ్యత ఇచ్చారు తప్పా.. ఎక్కడికక్కడ మిమ్మల్ని నిలదీస్తం తప్పా.. వదిలిపెడతాం అనేదాంట్లో ఉండొద్దు. ప్రజలకు అన్యాయం చేయొద్దు. నేను రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా.. ఏ విధంగా బీఆర్ఎస్ గవర్నమెంట్ ఇచ్చిందో.. ఆ విధంగా కరెంటును పునరుద్ధరించాలి. ఆవిధంగా రాష్ట్ర రైతాంగానికి కరెంటు ఇవ్వాలి. కానీ వీళ్ల యవ్వారం ఎట్లున్నది ? చరిత్రలో ఎన్నడూ లేదు. అసెంబ్లీలో జనరేటర్ పెట్టారు వీళ్ల తెలివికి. మొన్న మనోళ్లు మీటింగ్‌లో తిరుగుతుంటే.. ఒక్క మీటింగ్‌లో మాట్లాడుతుంటే ఏడుమాట్లు పోతది కరెంటు. నల్లగొండలో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతుంటే ఏడుసార్లు కరెంటు పోతది. ఏం మాయరోగ మచ్చింది. మీకు తెలివి లేక.. నడపరాక.. చేతగాక ఇవాళ మందిమీద బద్నాం పెట్టి బతుకుదామనుకుంటున్నరా? అట్లగాదు బిడ్డా జాగ్రత్త బతుకనివ్వం. వెంటపడుతం. వేటా డుతం' అని హెచ్చరించారు. రాజకీయాల్లో ఒకరు ఓడొచ్చు.. ఒకరు గెలవొచ్చు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. మళ్లా మేం డబుల్ స్పీడ్‌తో అధికారంలోకి వస్తాం. అప్పుడు మేం గిట్లనే మాట్లాడాలా..? ఈ పద్ధతిని అనుసరించాలా..? అని కేసీఆర్ ప్రశ్నించారు. చలో నల్లగొండ సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. నదుల నీళ్ల మీద నీకు అవగాహన లేదు. నన్ను అడిగితే నేను చెప్తుంటి. అడిగే సంస్కారం, తెలివి ఉండొద్దా..? అన్న గిట్ల అంటున్నరు.. కేఆఆర్ఎంబీకి అప్పజెప్పమంటున్నారు.. మమ్మల్ని ఎవరిని అడిగినా చెప్పేటోళ్లం కదా.. అప్పజెప్పదం, ఆగమావ దం.. బడ్జెట్ ఆపి తీర్మానం పెట్టుడు ఇదేనా మీ తెలివి అని కేసీఆర్ నిలదీశారు.అసెంబ్లీలో తీర్మానంతో, చలో నల్లగొండతో ఆగిపోదు.. కృష్ణా నదిలో న్యాయమైన వాటా తేలే వరకు ప్రతి సందర్భంలో ఈ ఐదు జిల్లాల ప్రజలు, కృష్ణా పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు పోరాడేందుకు సిద్ధంగా ఉండాలి. ప్రజలకు అర్థమైతదనే ఈ సభ పెట్టాను. ఇది రాజకీయ సభ కాదు. ఇవాళ ఏ ఎన్నికలు లేవు. పార్లమెం ట్ ఎన్నిలకు రెండు నెలలు ఉంది. రాజకీ యాల కోసం రాలేదు. ప్రజలు మన హక్కుల మీద న్యాయమైన పోరాటాలకు సిద్ధంగా లేకపోతే బొందిగే పీసికేస్తరు తప్ప మనకు న్యాయం జరగదు. అందుకే మీ అందరికి దండం పెట్టి చెబుతున్నా. నేను మీ బిడ్డను. 15 ఏండ్లు పోరాడి చావు నోట్లో తలకాయపెడితే చివరకు ఈ తెలంగాణ తెచ్చింది నేను. అందుకే నాకు తెలంగాణ మీద ఫికర్ ఉంటది. నాశనం కావొద్దనే తపన ఉంటుంది. ప్రభుత్వ దమననీతిని ఎండగట్టేందుకు ఎప్పుడు పిలిచినా.. రావాలి అని కేసీఆర్ అన్నారు. రేపు చాలా చేయాల్సి ఉంటది. ఇప్పుడే కరెంట్‌ను ఇట్ల చేసింద్రు.. రేపు, మార్చి, ఏప్రిల్, మే నెలలో కరెంట్ ఇస్తరా.? అసెంబ్లీలోనే జనరేటర్ తెచ్చిపెట్టింద్రు.. అంతపాటి ఘనులు వీరు. ఇదే నరేంద్ర మోదీ ప్రభుత్వం మీటర్లు పెట్టాలి.. నా తలకాయి పోయిన సరే పెట్టను అని చెప్పాను. 25 వేల కోట్లు ఇవ్వలేదు. అయినా పెట్టలేదు. ఎందుకంటే నా తెలంగాణ రైతులు గుట్టకు ఒకడు, చెట్టుకు ఒకడు అయింద్రు. హైదరాబాద్ పోయి ఆటో రిక్షాలు నడిపే గతివచ్చింది. కాబట్టి వీరు మళ్లీ ఒక దరికి రావాలి. రైతాంగం బాగుంటే పని దొరుకుతదని చెప్పి.. అన్నీ చేశాం. రైతుబంధు ఎంత మంచిగా వచ్చేది.. బ్యాంకులో పడి ఫోన్ టింగ్ టింగ్‌మని మోగుతుండే.. ఇప్పుడు బ్యాంకుల పడుట లేదు. ఫోన్ మోగడం లేదు. ఏం మోగుతుంద్రా అంటే.. రోజు అసెంబ్లీలో అరుస్తా ఉన్నారు.. పనికిమాలిన మాటలు.. మీరంతా చూస్తున్నరు కదా.. మీరేం భయపడకండి.. మళ్లా మనమే వస్తం. అన్ని చేసుకుందాం. ఏం కానివ్వం తెలంగాణను. ఈ మధ్యలో దుర్మార్గం చేస్తే కొట్లాడుదాం.. పోరాడుదాం.. మన హక్కుల కోసం నిలబడుదాం అని కేసీఆర్ ధైర్యం చెప్పారు. ఉత్తర తెలంగాణ వర ప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టు పట్ల విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక ఆటబొమ్మ కాదు.. అవగాహన చేసుకొని మాట్లాడాలి అని కేసీఆర్ పేర్కొన్నారు. చలో నల్లగొండ సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. చలో నల్లగొండ సభ నుంచి ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా. ఇవాళ గోదావరికి ప్రధానమైన ఉపనది ప్రాణహిత. ఇవాళ కూడా 5 వేల క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. అవి ఎత్తిపోయా లి. ఎల్ఎండీ, ఎంఎండీ నింపాలి. రైతులకు నీళ్లు ఇవ్వాలి. కానీ ఏం జేస్తుంద్రు.. మేడిగడ్డ పోతాం. బూరుగుగడ్డ పోతాం. బొందలగడ్డ పోతాం.. ఏం తొకమట్ట ఉన్నాది మేడిగడ్డ వద్ద.. బిడ్డ ఈ స్టేజీ మీద ఉన్న నాయకులంతా అసెంబ్లీ అయిపోయాక మేం కూడా అక్కడికి పోతాం.. మీ బండారం బయటపెడుతాం. మీ చరిత్ర మొత్తం ఎండగడుతాం. ఓ లంగచాత పెట్టి పోయిన ప్రభుత్వాన్ని బద్నాం చేయాలి.. బట్టకాల్చి మీద వేయాలని చెప్పి మేం మేడిగడ్డ పోతాం అంటరు. మేడిగడ్డకు పోయి ఏం పీకుతరు.. ఎందుకు పోతున్నావు మేడిగడ్డకు. దమ్ముంటే నీళ్లు ఎత్తిపోయి.. నీళ్లు ఉన్నాయి.. కాపర్ డ్యాం పెట్టి కూడా నీళ్లు ఎత్తిపోయొచ్చు.

prajamantalau daily pages (14-02-24)_times of varha main (13-2).qxd 2/14/2024 1:11 AM Page 4



## బాధిత కుటుంబానికి అండగా ఎన్ఆర్ఐ రాం రెడ్డి

### 50 కిలోల బియ్యం అందజేత



ధర్మసాగర్ ఫిబ్రవరి 13 (ప్రజామంటలు): నారాయణగిరి గ్రామానికి చెందిన పసునూరి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారికి కుటుంబానికి అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వల్లపురెడ్డి రాం రెడ్డి అండగా నిలిచారు. మృతుని కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యాన్ని సహాయంగా అందజేశారు. ఈమేరకు మంగళవారం రామన్న యువసేన సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిoచి బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ మడికంటి రాజయ్య, మాజీ ఎస్ఎంసి చైర్మన్ వక్కల కరుణాకర్, కడియం యువసేన అధ్యక్షుడు గంటే కృష్ణ, వక్కల శ్రీనివాస్, వక్కల వీరన్న, రజినీకాంత్, వక్కల రాజు, స్టీఫెన్, తదితరులు పాల్గొన్నారు.

## కొడిమ్యాల లోస్కూల్ కాంప్లెక్స్ సమావేశం



కొడిమ్యాల ఫిబ్రవరి 13 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లోని ఉన్నత పాఠశాలలో మంగళ వారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఇందులో మండలం లోని సగం మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు హాజరు అయ్యారు. ఇట్టి సమావేశం లో వివిధ పాఠశాలలో జరిగే బోధన పద్ధతులు ఉపాధ్యాయులు చెబుతూ, తక్కువ స్థాయి విద్యార్థులకు బోధన ఏవిధంగా చేయాలని తమ అనుభవాల ను వివరించారు. అనంతరము మధ్యాహ్నం సంద్రాలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి నాలుగవ తరగతి విద్యార్థులకు బొమ్మ గుఱ్ఱం మాదిరి తెలుగు పాఠ్య బోధన చేశారు. ఉపాధ్యాయులు వెంకటేష్ ఐదవ తరగతి కి ఆంగ్ల బోధన చేశారు. ఈ కార్యక్రమం లో కొడిమ్యాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయేంద్ర,పూడూర్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు హరిత, రిసోర్స్ పర్సన్ లు రమేష్, హరి కృష్ణ , వివిధ పాఠశాలల నుండి వచ్చిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అయోధ్య వెళ్లే ట్రైన్‌కు జెండా ఊపి ప్రారంభించిన ఎంపీ అరవింద్

నిజామాబాద్ ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):



నిజామాబాద్ పార్లమెంట్ నుండి శ్రీ అయోధ్య బాలరాముడు దివ్యదర్శనం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అష్ట స్పెషల్ ట్రైన్ ను నిజామాబాద్ ఎంపీ శ్రీ ధర్మపురి అరవింద్ , నిజాంబాద్ అర్బన్ ఎమ్మెల్యే శ్రీ ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తో కలిసి జెండా ఊపి ప్రారంభించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణిప్రవీణ్.

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ. 25,116 విరాళం

కొడిమ్యాల ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):



మండల కేంద్రములోని పునర్మిర్మాణం జరుగుచున్న కొడిమ్యాల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయమునకు బీవండి కి చెందిన చిలివేరి శంకరయ్య- పుష్మల. కుమారులు కోడళ్ళు: శ్రీనివాస్-రమ్య, శ్రావణ్-ఆరాధ్య మనుమలు మనమరాలు శ్రేష్ఠ యోగి, అద్వైత్,సహస్ర, సహేష ల కుటుంబం ఆలయ నిర్మాణానికి మరియు అభివృద్ధి కొరకై శాశ్వత చందదారులుగా 25,116/- రూపాయలు అందజేశారు. ధనరూపేనా సహకరించిన దాతల కుటుంబానికి అర్చకులు నాగరాజు రమేష్ స్వామి వారి మంగళశాసనములు అందజేయడం జరిగింది. ఆలయమునకు సహకరించిన దాతలకు గ్రామస్తుల తరుపున, భక్తుల తరుపున, నిర్మాణ కమిటీ తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసినారు.

## ఎంపీకి అంబారిపేట వెంకటేశ్వర కళ్యాణం ఆహ్వాన పత్రిక అందజేత

జగిత్యాల ఫిబ్రవరి 13 (ప్రజామంటలు): అర్బన్ మండలము అంబారిపేట స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణిప్రవీణ్. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ మరియు అధ్యక్ష కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# 16న దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ విజయవంతం చేయాలని పిలుపు

ఎల్కతుర్తి ఫిబ్రవరి 13 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండలంలో జరగబోయే దేశవ్యాప్తకార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్ విజయవంతం చేయాలని వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పుల్ల అశోక్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి గుమ్మడి రాజుల రాములు హాజరై మాట్లాడారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చి పది సంవత్సరాలు పూర్తవు తుంది అయినా రైతు కార్మిక ప్రజల సమస్యలను పరిష్కరిం చలేదు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తారని చెప్పిందన్నారు. నేటికీ ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైం దాన్ని ఆయన అన్నారు నిరుద్యోగ గత 50 సంవత్సరాలు గడిసిపోతున్న బిజెపి ప్రభుత్వము హయాంలో ధరలు అధికంగా పెరిగాయి అని ఆయన అన్నారు. 30% నుండి 50% వరకు పెరిగాయి. పెట్రోల్ ఉత్పత్తుల పైన కేంద్ర ప్రభుత్వము పన్నులు వాటా 20043 శాతానికి పెరిగింది అని అన్నారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పుల్ల అశోక్ మాట్లాడుతూ కార్మికులు కొట్లాడి తెచ్చుకున్న చట్టాలను 44 చట్టాలను నాలుగు కోట్లుగా



చేసి అని ఆయన అన్నారు కనీస వేతనాలు 26 వేల రూపాయ లు ఇవ్వాలని ఆయన అన్నారు. కోట్ల మంది కార్మికులకు వర్తింపజేసే ఈపీఎఫ్ పెన్షన్ నెలకు పదివేల రూపాయలు పెంచాలని ఆయన అన్నారు సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్స్ ఓపిఎస్ ను పునరాదించాలి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎనిమిదవ కమిషన్ను నియమించకుండా జాప్యం చేస్తుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు అంబాల సరూప, లోకిని సరూప, మమత, సరోజన, అరుణ, సుకన్య, వీణవంక, రమేష్, శీను, రాధా రమ, సుబ్రహ్మణ్యం, కార్తిక, షణ్ముఖం, రజిత, సౌజన్య, లక్ష్మి, లత పాల్గొన్నారు.

# మేడిగడ్డను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం

మహాదేవపూర్ ఫిబ్రవరి 13 (ప్రజామంటలు): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని అంబటిపల్లి మేడిగడ్డ వద్ద గోదావరి నదిపై బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా లక్ష్మి బ్యారేజ్ ను నిర్మించగా మూడేళ్లలోనే బ్యారేజ్ పిల్లర్లు కుంగి పోవడంతో ప్రాజెక్ట్ లోని లోపాలను ఎత్తిచూపేందుకు వాస్తవాలను ఎత్తి చూపేందుకు వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంగళవారం ఉదయం అసెంబ్లీ నుండి నేరుగా మంత్రులు ఎమ్మెల్సీల బృందంతో కలిసి రోడ్డు మార్గం ద్వారా ప్రత్యేక బస్సులలో మేడిగడ్డకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రుల బృందం ఇరిగేషన్ అధికారులతో కలిసి లక్ష్మీ బ్యారేజ్ కాపర్ డ్యాం కుడి వైపుకు చేరుకొని 7 బ్లాక్ లో పగిలిన పిల్లర్ 19.20.21.22 ను సీఎం మంత్రులతో కలిసి కుంగిన పిల్లర్ లను పగుళ్లను పరిశీలించారు. అక్కడ బ్యారేజీలో కుంగిన పిల్లర్లు బ్యారేజీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత అక్కడ చేపట్టిన పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు తర్వాత అధికారులు మేడిగడ్డ బ్యారేజ్ పరిస్థితి పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



# కోర్టులోకి వస్తే స్వంత ఇంటిలాగా అనిపిస్తోంది

### నాకు గెలుపోటములు సహజం : ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):



కోర్టులోపలికి వస్తే స్వంత ఇంటికి వచ్చిన భావన కలుగుతుందని, నేను జగిత్యాల కోర్టులో న్యాయవాదిగా పనిచేశానని మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రధాన న్యాయస్థానంలో నూతనంగా నిర్మించిన హాల్ ను జీవన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. న్యాయస్థానంలో కావలసిన పనులు ఛాంబర్ ఫ్లోరింగ్ లిఫ్ట్ అదనపు అంతస్తు నిర్మాణం పనులకు నిధులు సమకూరేల కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ నాకు గెలుపు ఓటములు సహజమని 2018 ఎన్నికలలో ఓడిన తదుపరి పట్టభద్రుల ఎమ్మెల్సీగా అందరి సహకారంతో పార్టీలకు అతీతంగా నా గెలుపుకు సహకరించారు అని భవిష్యత్ లో కూడా మీ సహకారం ఉంటుందని బావిస్తున్ననన్నారు. పెద్దలు, న్యాయవాద సభ్యులు తెలిపిన విదంగా కోర్టు సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరాం జరిగే సమస్యలను పరిష్కరించబడే విదంగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు.బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా ప్రధాన న్యాయస్థానం మరమ్మత్తుల పనులకు నిధులు కేటాయిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీపాల్ రెడ్డి, బండ భాస్కర్ రెడ్డి, తాండ్ర సురేందర్, గుంటి జగదీశ్వర్, అంజయ్య, మధుసూదన్ రెడ్డి, బెత్తెపు లక్ష్మణ్, శ్రీరాములు, శంకర్ రెడ్డి, డబ్బు లక్ష్మారెడ్డి, రేపల్లె హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## 16న గ్రామీణ భారత్ బందులో పాల్గొంటాం

### జిల్లా కలెక్టర్ కు ఏఐటీయూసి సమ్మె నోటీస్



జగిత్యాల ఫిబ్రవరి 13 (ప్రజామంటలు): ఈనెల 16 న దేశ వ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె ,గ్రామీణ భారత్ బంధులో మేము సైతం పాల్గొంటామని గిడ్డంగుల హమాలి లేబర్ కాంట్రాక్ట్స్ సహకార సంఘం సభ్యుల పక్షాన ఏ ఐ టీ యూ సి నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఏఓకు సమ్మె నోటీస్ అందజేశారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం రైతు, ప్రజా, కార్మిక,రైతు కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జయింట్ ఫ్లాట్ఫార్మ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్లు ,కార్మిక, వివిధ రకాల ఉద్యోగ సంఘాలు అఖిలభారత స్థాయిలో కార్మికసమ్మెతో పాటు గ్రామీణ భారత్ బంధు పాటించాలని పిలుపునిచ్చాయని ఏ ఏఐటీయూసీ నాయకులు శ్రీగాధ దేవదాసు, వెన్న మహేష్ లు తెలిపారు. అందుకు గిడ్డంగుల సంస్థ కార్మికులం సైతం సమ్మెలో పాల్గొంటున్నామని అధ్యక్షులు జాడి తిరుపతి, దుర్గయ్య, శ్రీనివాస్ లు ఏ ఓ కు ఇచ్చిన సమ్మె నోటీసులో పేర్కొన్నారు.

## అయోధ్య వెళ్లే ట్రైన్ కు జెండా ఊపి ప్రారంభించిన ఎంపీ అరవింద్, బోగ శ్రావణి

### ఇబ్రహీంపట్నం మండలం నుండి వెళ్లిన భాజపా నాయకులు

### పాల్గొన్న డా. బోగ శ్రావణి ప్రవీణ్

ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):



నిజామాబాద్ పార్లమెంట్ నుండి శ్రీ అయోధ్య బాలరాముడు దివ్యదర్శనం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అష్ట స్పెషల్ ట్రైన్ ను నిజామాబాద్ ఎంపీ శ్రీ ధర్మపురి అరవింద్ , నిజాంబాద్ అర్బన్ ఎమ్మెల్యే శ్రీ ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తో కలిసి జెండా ఊపి ప్రారంభించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి ప్రవీణ్. అయోధ్య రామయ్య దర్శనానికి వెళ్లినవారు దగ్గుల అశోక్, నారే రాజేష్, సాయి గౌడ్, బైండ్ల శ్రీనాథ్, ఉడుత రాజు , బైన మహేష్, పత్తి కృష్ణ, బైన మల్లేష్ ,ఆర్ భూమారెడ్డి, ఇల్లెందుల తిరుమల చారి, మాలపు శ్రీనివాస్, మాలెపు కోటగిరి, వెంకటస్వామి వెళ్ళినారు.

## బీసీలకు బడ్జెట్లో 8 వేల కోట్లు కాదు 20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్

జగిత్యాల ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):



రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో బిసిల బడ్జెట్ 8 వేల కోట్లు కాదు 20 వేల కోట్లకు పెంచాలని బిసి సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వము ప్రవేశపె ట్టిన బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బడ్జెట్‌లో కేవలం 8 వేల కోట్లు మాత్రమే కేటాయించడం చాలా దారుణం. కామారెడ్డి బిసి డిక్లరేషన్ సభలో బీసీలకు ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయలు చెల్లిస్తామని చెప్పి జ్యోతిరావు పూలే ఉప ప్రణాళికలను అసెంబ్లీ సమావేశంలో చట్ట బద్ధత కల్పించాలని మరియు అసెంబ్లీ ఆవరణలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, బీసీలకు ఎనిమిది వేల కోట్లు కాదు 20 వేల కోట్లు కేటాయించాలని చట్టసభల్లో పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బడ్జెట్?లో కొత్త స్కీముల ఊసే లేదు, స్కాలర్ షిప్ లకు, మెస్ చార్జీల ప్రస్తావనే లేదని, మరియు వచ్చే పార్లమెంటు ఎన్నికలలో బిసిలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని, చట్ట సభల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించేం దుకు పార్లమెంటులో బిసి బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

## మృతి చెందిన కుటుంబాలకు 150 కిలోలు బియ్యం అందించిన బిల్లా యాదగిరి

వేలేరు ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):



వేలేరు మండల కేంద్రంలోని మంగళవారం వేలేరు గ్రామానికి చెందిన గూడూరు ఎల్లయ్య, సూత్రపు రాజు , మరియు కూరపాటి ఆగయ్య గార్లు ఇటీవల మృతి చెందడం జరిగింది. వారి కుటుంబాల సభ్యులను పరామర్శించి వారికి సహాయంగా 150 కేజీల బియ్యాన్ని అందించిన ప్రజల సమస్యలు తెలిసిన నాయకులు మాజీ కూడా డైరెక్టర్ బిల్లా యాదగిరి కార్యక్రమంలో రాజయ్య, తిరుపతి రెడ్డి, వెంకన్న, కరుణాకర్, మల్లయ్య , పెరుమయ్య, గణేష్, రాకేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

prajamantalau daily pages (14-02-24)_times of varha main (13-2).qxd 2/14/2024 1:11 AM Page 5



# శానిటేషన్ వర్కర్ల హక్కులను కాపాడాలి

## జాతీయ సఫాయి కరమ్ చారి కమిషన్ చైర్మన్

## గాంధీ ఆసుపత్రిలో అధికారులతో సమావేశం




**సికింద్రాబాద్ ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):** శానిటేషన్ కార్మికుల హక్కులను కాపాడుతూ, వారి సంక్షేమాన్ని మరవకూడదని, వారికి కనీస వేతనాల నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖలోని జాతీయ సఫాయి కరమ్ చారి కమిషన్ (న్యూఢిల్లీ) చైర్మన్ ఎం.వెంకటేశ్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ ఆసుపత్రి, గాంధీ మెడికల్ కాలేజీ లకు చెందిన అధికారులతో పాటు శానిటేషన్ వర్కర్లతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి రోజు ఎన్నిగంటల పాటు పనిచేస్తున్నారు..జీతాలు ఎంత ఇస్తున్నారు. ప్రతినెలా సక్రమంగా ఇస్తున్నారా..అని అడిగి తెలుసుకున్నారు. ఈఎస్ఐ , పీఎఫ్ లాంటి సౌకర్యాలు ఉన్నాయా గ్రూఫ్ ఇన్స్యూరెన్స్ సదుపాయం కల్పించారా..అని అడిగారు. అలాగే ఏడాదికి రెండు జతల యూనిఫారాలు, బూట్లు, మహిళా కార్మికులకు చీరలు ఇస్తున్నారా అని సిబ్బందిని అడిగారు. నెలకు నాలుగు సెలవులు ఇస్తున్నారా అని ఆయన స్వయంగా కార్మికులను పిలిచి, అడిగి తెలుసుకున్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ డబ్బుల జమలతో పాటు ప్రతినెలా జీతాలకు సంబందించిన మొబైల్ మెసెజ్, పే స్లిప్ లను చూపెట్టమని కమిషన్ చైర్మన్ కార్మికులను అడగ్గా, ఎవరూ చూపించలేక పోయారు. ఉద్యోగ సిబ్బంది ఏదైనా సమస్యలు, వేధింపులు ఉంటే వాటి గురించి ఫిర్యాదు చేయడానికి ఒక మహిళా ఉన్నతాధికారిని నియమించి, ఆమె ఫోన్ నెంబర్ నోటీస్ బోర్డులో పెట్టాలని ఆయన గాంధీ అధికారులను ఆదేశించారు. టే తమకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఎం.రాజారావు, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.రమేశ్రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.కృష్ణమోహన్, ఆర్ఎంవోలు, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు, సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ తెలంగాణ అద్యక్షులు రాజేశ్, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కాన్షిరామ్‌కు భారతరత్న ఇవ్వాలి

## తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్పాల ప్రకాష్



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):** దేశంలో బడుగు, బలహీన అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ కలలు గన్న రాజ్యం కోసం, దారిద్రరేఖకు దిగువ ఉన్న ప్రజలకు రాజ్యాధికారం రావాలని, పరితపించిన వ్యక్తి కాన్షిరామ్ అని, అలాంటి వ్యక్తికి భారతరత్న అవార్డు ఇవ్వాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్పాల ప్రకాష్ డిమాండ్ చేశారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు సైకిల్ తో బయలుదేరి, దేశ ప్రజలతో మమేకం అవుతూ, రాజ్యాంగ ఫలాలను వివరించిన మహనీయుడని కొనియాడారు. రాజ్యాధికారం కోసం దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్ లో ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళ బెహన్జి కుమారి మాయావతిని నాలుగుసార్లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. సామాజిక విప్లవ ఉద్యమంతోనే దేశంలో బహుజన సమాజం రాజ్యాధికారం దిశగా అడుగులు వేసిన వ్యక్తి అని అన్నారు. ఈ దేశంలో అంటరాని వ్యవస్థలో అవహేళన పడ్డ బహుజన సమాజం నేడు రాజకీయ పథంలో నడుస్తున్నదంటే, అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ప్రజలకు తీసుకువెళ్లిన గొప్ప వ్యక్తి అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యున్నత భారతరత్న పురస్కారాన్ని ప్రకటించాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కందే సుధాకర్, కొడముంజ బాలరాజు, పొన్నాల వినోద్ కుమార్, వేముల జగదీష్, కొంకటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైని కలిసిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్



**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):** మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అనిల్ గారిని ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ నాయకులైన మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ మరియు యూత్ కాంగ్రెస్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ అయిన కూన రాకేష్ మరియు రెబ్బిటి రాజశేఖర్ నచిపల్లి రాజకుమార్, గుర్రాల దశరథ్ తీపిరి అశోక్, గంగాధర్ మొదలగు నాయకులు ఎస్ఐ ని కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపినారు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజలకు సేవ చేయాలని కోరారు.

## గంజాయి నిర్మూలనకు సహకరించాలి

### ఎస్సై సతీష్ కుమార్



**గొల్లపల్లి ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):** మండలంలో గంజాయిని గంజాయి నిర్మూలనకు పత్రిక మిత్రులు సహకరించా గలరని ఎస్సై చిర్ర సతీష్ కోరారు. మంగళవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన సతీష్ ను గొల్లపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై ఎస్ఐకి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయి సహకారం అందించాలని, గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు పత్రిక మిత్రులతో పాటు మండల ప్రజలు సహకరించాలని కోరారు. శాంతిభద్ర తల పరిరక్షణకు విఘాతం కలిగించే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు., కాగా గొల్లపల్లి తాసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ జమీర్ ను ప్రెస్ క్లబ్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొల్లె రాజన్న, కరుణాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కట్ట శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ గౌరవా ధ్యక్షులు గందె వేణు, సభ్యులు బుర్ర మహేష్ గౌడ్, బొమ్మెన కుమార్, సంధ్య వేణి ప్రభాకర్, మహంకాళి చంద్రశేఖర్, గట్ల శ్రీధర్, అంకం భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీమిండియా మాజీ కెప్టెన్ దత్తాజీరావు గైక్వాడ్ కన్నుమూత

భారత క్రికెట్‌లో విషాదం చోటు చేసుకుంది. టీమిండియా మాజీ కెప్టెన్ దత్తాజీరావు గైక్వాడ్ కన్నుమూశారు. ఆయన వయసు 95 ఏళ్లు. వృద్ధాప్య సంబంధిత సమస్యలతో మంగళవారం తెల్లవారుజామున బరోడాలోని తన నివాసంలో ఆయన తుది శ్వాస విడిచారు. గత 12 రోజులుగా ఐసీయులో ఉన్న దత్తాజీరావు ఈ తెల్లవారుజామున మరణించినట్లు కుటుంబ సభ్యులు పీటీఐకి తెలిపారు. భారత మాజీ ఓపెనర్, జాతీయ కోచ్ అన్షుమాన్ గైక్వాడ్ తండ్రే దత్తాజీరావు గైక్వాడ్.దత్తాజీరావు గైక్వాడ్ పూర్తి పేరు దత్తాజీరావు కృష్ణారావు. అందరూ ఆయనను దత్తా గైక్వాడ్ అని పిలుస్తారు. 1952-1961 మధ్య భారత్ తరపున 11 టెస్టులు ఆడిన గైక్వాడ్.. 18.42 సగటుతో 350 పరుగులు చేశారు. 1959 ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించారు. అయితే ఆ సిరీస్‌లో ఐదు మ్యాచ్‌ల్లోనూ భారత్ ఓడిపోయింది.

## గౌడ ప్రొఫెషనల్ అండ్ అఫీషియల్స్ 2024 క్యాలెండర్ ఆవిష్కరణ

**జగిత్యాల ఫిబ్రవరి 13 ( ప్రజామంటలు):**




సంఘ పటిష్టత అందరి ధ్యేయం కావాలని జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, గోపా జిల్లా అధ్యక్షులు దుర్గం రవీందర్ గౌడ్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఏటీఎం ఆసుపత్రిలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు .ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గోప సభ్యత్వం పెంచి గౌడ కులంలో పేదవారికి ఆర్థికంగా ఆదుకోవాలని అదేవిధంగా ప్రతిభగల విద్యార్థులకు పురస్కారాలు అందించాలని పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా అందర్నీ సంఘటిత పరిచి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబటి రాజయ్య, గుర్రం సత్యనారాయణ గౌడ్, మెప్మా శ్రీనివాస్, నేరెళ్ల మల్లేశం గౌడ్ వివిధ మండలాలకు చెందిన బాధ్యులు గోపా సభ్యులు పాల్గొన్నారు.

## పోలీసు భద్రతా పథకం కింద మంజూరైన చెక్కును మృతుని కుటుంబ సభ్యులకి అందజేసిన జిల్లా ఎస్పీ

**వెల్గటూర్ ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):**



వెల్గటూర్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఏఎస్ ఐ రాజమల్లయ్య కుటుంబానికి జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ భద్రత పథకం కింద మంజూరు కాబడిన 7,63,040 పాయల చెక్కును రాజమల్లయ్య భార్యకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... రాజమల్లయ్య కుటుంబానికి పోలీస్ శాఖ తరుపున పూర్తి సహకారం అందిస్తూ వారి కుటుంబానికి భరోసా కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి అమర్ నాథ్, సూపరిండెంట్ నయీం పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన అరుకుల అనిల్ 15



**ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నూతన ఎస్సై గా అరుకుల అనిల్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐ గా పనిచేసిన ఉమసాగర్ వెల్గటూర్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అసాంఘిక కార్యక్రమాల, అక్రమ మద్యం పై దృష్టి సాధిస్తామన్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది నూతన ఎస్సై అనిల్ కు శుభాకాంక్షలు తెలిపారు.

### ఎంపీ అరవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణితో నూతన పట్టణ అధ్యక్షుడు

**జగిత్యాల ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):**



భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి వీణ్ తో కలిసి నూతనంగా నియమితులైన భారతీయ జనతా పార్టీ జగిత్యాల పట్టణ అధ్యక్షులు రంగు గోపాల్ బీర్పూర్ మండల అధ్యక్షులు ఆడెపు నర్సయ్య మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

## చిన్నపిల్లలకు విటమిన్ "ఏ" అందించిన ఆరోగ్య సిబ్బంది




**భీమదేవరపల్లి ఫిబ్రవరి 13 (ప్రజామంటలు) :** మండలం లోని మల్లారం గ్రామంలో 9 నెలల నుండి 5 సం.ల లోపు పిల్లలకు ల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నివేదిత ఆధ్వర్యంలోవిటమిన్ "ఏ" తీసుకోవడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి పిల్లలకు విటమిన్ "ఏ" చుక్కలను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం గీత, అంగన్వాడి టీచర్ శోభా రాణి, ఆశా కార్యకర్తలు భాగ్య, రాధిక, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

# "సేవా రత్న" నేషనల్ అవార్డు అందుకున్న "చుక్క గంగారెడ్డి"

## ఉద్యమాల జర్నలిస్ట్‌కు గొప్ప గుర్తింపు

**బుగ్గారం ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):**




జగిత్యాల జిల్లాకు చెందిన ప్రముఖ ఉద్యమకారుడు చుక్క గంగారెడ్డి "సేవా రత్న" నేషనల్ అవార్డు - 2024 ను అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతిలో ఫిబ్రవరి 11 ఆదివారం సాయంత్రం జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 7వ నేషనల్ కాన్ఫరెన్స్ లో బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డా. సుబ్రమనియన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యం.యం. గౌతమ్ ల చేతుల మీదుగా చుక్క గంగారెడ్డి కి "సేవారత్న నేషనల్ అవార్డు" ను అందజేశారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మట్లాడుతూ చుక్క గంగారెడ్డి ఉద్యమాల చరిత్రను, సమాజానికి ఆయన చేసిన సేవలను, జర్నలిస్ట్ గా రచించిన వార్తాంశాలను కొనియాడారు. రక్తదానం, విద్యా దానం, సేవా దానంలతో పాటు ఆర్టీఐ కార్యకర్తగా, హక్కుల కార్యకర్తగా, అవినీతి - అక్రమాల, దోపిడీల నిర్మూలన కోసం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చుక్క గంగారెడ్డి చేసిన పోరాటాలను, ఇతరత్రా సేవలను గుర్తించి ఈ అవార్డ్ ప్రదానం చేయడం జరిగిందన్నారు. తీయ అవార్డ్ సెలక్షన్ కమిటీ సభ్యులు తాల్లపల్లి సురేందర్ గౌడ్ సూచనలతో, బి.ఎస్.ఎ. రాష్ట్ర అధ్యక్షులు, అవార్డుల సెలక్షన్ కమిటీ సభ్యులైన యం. గౌతమ్ ల ప్రతిపాదనల మేరకు వాస్తవాలను, ఆధారాలను పరిశీలించి చుక్క గంగారెడ్డి కి ఈ అవార్డ్ ప్రధానం చేయడం జరిగిందని నేషనల్ సెలక్షన్ కమిటీ చైర్మన్ నల్లా రాధా కృష్ణ వివరించారు. ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమి వారు ప్రతి ఏట ప్రజా ఉద్యమకారులకు, సంఘసేవకులకు, కవులకు, రచయితలకు, స్వచ్ఛంద సంస్థలకు ఇలాంటి అవార్డులను అందజేస్తున్నట్లు నల్లా రాధా కృష్ణ తెలియజేశారు. సౌత్ ఇండియాలోని 6 రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదిచ్చేరి రాష్ట్రాలతో పాటు మహా రాష్ట్ర, అస్సాం, ఛత్తీస్ ఘడ్, ఒరిస్సా, మధ్య ప్రదేశ్ తదితర రాష్ట్రాల నుండి సుమారుగా 600 మందికి పైగా డెలిగెట్స్ ఈ కాన్ఫరెన్స్ కు హాజరైనారని ఆయన తెలియజేశారు. ప్రముఖ సినీ, గేయ రచయిత, ప్రజా కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్, బహుజన సాహిత్య అకాడమీ సౌత్ ఇండియా జనరల్ సెక్రెటరి జి.విష్ణువర్ధన్, కమిటి సభ్యులు యం.యం. గౌతమ్, బాదె వెంకటేశం, తాటికంటి అయిలయ్య, వంగ కుమారస్వామి, వై. రవీంద్రప్రసాద్, ముక్కెర సంపత్ కుమార్ తదతరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు రాధాకృష్ణ ఒక ప్రకటనలో వెల్లడించారు.

prajamantalau daily pages (14-02-24)_times of varha main (13-2).qxd 2/14/2024 1:11 AM Page 6



# పిండ మార్పిడి ద్వారా దేశీయ జాతి ఆవులను పాడి ఆవుగా మార్చవచ్చు

### ప్రధాన ఆచార్యులు డాక్టర్ కే రామచంద్రారెడ్డి

భీమదేవరపల్లి ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):



పిండ మార్పిడి ద్వారా సాహివాల్ జాతి దూడలను స్థానిక ఆవులలో పుట్టించడం కొరకు నిర్దేశించిన శాస్త్రీయ ప్రయోగాన్ని కోరుట్ల పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం, పశు పునరుత్పత్తి (గైనకాలజీ) విభాగం గోకుల్ మిషన్ ద్వారా ముత్తారం గ్రామంలో స్థానిక ఆవులకు పిండ మార్పిడి చేశారు. గ్రామంలోని పశువులకు వివిధ శాస్త్రీయ పద్ధతుల ద్వారా పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కే రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జాతి దేశవాళి ఆవుల సంతతిని అభివృద్ధి పరచుకొని, ఎక్కువ పాల ఉత్పత్తిని పొంది, ఎక్కువ నికర ఆదాయాన్ని పొందవచ్చు అని అన్నారు. ప్రజలకు ఆరోగ్యాన్ని చేకూర్చే దేశవాళి ఆవు పాలను ఉత్పత్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ యూనివర్సిటీ బృందం, ముల్కనూర్ మహిళ డెయిరీ సిబ్బంది, జి. రవీందర్, శ్రీలత, మొగిలి, శంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కనికరం లేని కొడుకులు తల్లితండ్రులను ఇంటిలోనుంచి గెంటివేత

### ఆశ్రయమిచ్చిన సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్

జగిత్యాల ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):

జగిత్యాల పట్టణంకు చెందిన కుంచాల రాజయ్య (70), అనసూయ (65) అనే తల్లిదండ్రులను కన్నకొడుకులు సోమవారం రాత్రి వేళ తమ స్వంత ఇంటిలో నుంచి గెంటివేయడంతో పాత బస్ స్టాండ్ లో ఏడుస్తూ కూర్చున్నారు. జిల్లా సీనియర్ సిటీజేన్స్ అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ గమనించి వారిని వివరాలు అడుగగా తమ కోడళ్ల ప్రోద్బలంతో తమను ఇంటిలో నుంచి గెంటివేశారని రోదిస్తు చెప్పారు. వెంటనే తన ఇంట్లో ఆ వృద్ధ తల్లిదండ్రులకు ఆ రాత్రి ఆశ్రయమిచ్చిన హరి అశోక్ కుమార్ మంగళవారం ఉదయమే ఆ కొడుకుల వద్దకు తమ అసోసియేషన్ ప్రతినిధులతో వెళ్లి ఆ కనికరంలేని కొడుకులకు, కోడళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వయోవృద్ధుల సంక్షేమ,రక్షణ చట్టం పై అవగాహన కల్పించారు. నిరాదరిస్తే 3 నెలల జైలు శిక్ష,జరిమానా అందరికీ ట్రిబ్యునల్ చైర్మన్ అయిన ఆర్డీవో విదిస్తారని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇదివరకు ఆర్డీవో నర్సింహా మూర్తి వయోవృద్ధుల కేసుల్లో ఇచ్చిన తీర్పులను వివరించారు. ఈ కౌన్సెలింగ్ తో వారు స్పందించి తిరిగి తల్లి దండ్రులకి క్షమాపణ చెప్పి తమ ఇంటిలోకి ఆహ్వానించారు. వారిని ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా, తగు వైద్య సౌకర్యాలు చూసుకుంటామని ఒప్పంద పత్రాన్ని రాసి ఇచ్చారు. ఒక వేళ అతిక్రమిస్తే ఆర్డీవోకు ఫిర్యాదు చేయండని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి వెలుముల ప్రకాష్ రావు, ఉపాధ్యక్షులు కౌన్సెలింగ్ అధికారులు పి.సి. హన్మంత రెడ్డి, బొల్లం విజయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి. ఆశోక్ రావు, బొల్లం కరుణ తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక గూండాల రాష్ట్రంగా మారింది

### అసెంబ్లీలో నేతలమధ్య తీవ్ర వాగ్వాదం

**కర్ణాటక:** శాంతిభద్రతల పరిస్థితిపై కర్ణాటక అసెంబ్లీలో మంగళవారం తీవ్ర వాగ్వాదం జరిగింది. కర్ణాటక గూండాల రాష్ట్రంగా మారిందని ఆ రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ బీజేపీ ఆరోపించింది. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం బతికే ఉందా, చచ్చిందా అని బీజేపీ నేతలు ప్రశ్నించారు. సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ ఎమ్మెల్యేలు ఇచ్చిన వాయిదా నోటీసు ఆధారంగా శాంతిభద్రతలపై చర్చించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత సభలో తీవ్ర వాగ్వాదం జరగగా, బీజేపీ ఆరోపణలపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను బీజేపీ నేత లేవనెత్తారు. ఇటీవల బెళగావిలో మహిళలను నగ్నంగా ఊరేగించడం, హవేరీ గ్యాంగ్ రేప్, సైబర్ క్రైమ్, టెర్రర్ సంబంధిత కార్యకలాపాల కారణంగా రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ అన్నారు. దీనిపై చర్చ జరగాలి. ఈ విషయం గత సెషన్‌లో జాబితా చేయబడింది, కానీ చర్చించలేకపోయిందని మండిపడ్డారు.అసెంబ్లీలో జరిగిన గందరగోళాన్ని చూసిన రాష్ట్ర హోంమంత్రి జి పరమేశ్వర మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ప్రతిపక్షాలు లేవనెత్తడానికి ప్రభుత్వం వ్యతిరేకం కాదని, ప్రశ్నోత్తరాల సమయం తర్వాత లేవనెత్తాలని అన్నారు. శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయనే ఆరోపణలపై ప్రభుత్వం స్పందిస్తుందని, బీజేపీ హయాంలో జరిగిన హత్యలు, సంఘ వ్యతిరేక వ్యక్తులు బహిరంగంగా ఆయుధాలను ఎలా ఉపయోగించారో కూడా తెలుసని పేర్కొ న్నారు. ఆర్.అశోక్‌కు మద్దతుగా బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ.. హవేరీ గ్యాంగ్ రేప్ కేసులో సంబంధం లేని వ్యక్తులపై కేసు నమోదైనందున ఈ కేసు చాలా ముఖ్యమైనదన్నారు. మాండ్యాలో హనుమాన్ జెండా ఎగురవేసే విషయంలో సరిగ్గా అదే జరిగిందని.. ఇదంతా చూస్తుంటే రాష్ట్రంలో అరాచక వాతావరణం కనిపిస్తోందని బీజేపీ నేత అన్నారు.
బలాన్ని ఉపయోగించడం..

# సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలి

### బలప్రయోగం చివరి అస్త్రం కావాలి

### రైతుల ఆందోళనపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**పంజాబ్:** పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)తో పాటు రైతుల సమస్యల పరిష్కారానికి పలు డిమాండ్లు చేస్తూ రైతులు "ఢిల్లీ ఛలో" మార్చ్‌కి పిలుపునిచ్చారు. దీంతో ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొంది. రైతులను అడ్డుకునేందుకు బారికేడ్లు, ముళ్ల కంచెలను ఏర్పాటు చేశారు. పోలీసులతో పాటు కేంద్ర బలగాలు రైతుల్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రైతుల ఆందోళన నేపథ్యంలో పంజాబ్-హర్యానా హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై హైకోర్టు విచారించింది.సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని, బలప్రయోగం చివరి అస్త్రం కావాలని చీఫ్ జస్టిస్ జీఎస్ సంధావాలియా, జస్టిస్ లపితా బెనర్జీలతో కూడిన ధర్మాసనం మంగళవారం వ్యాఖ్యానించింది. నిరసనకారులు ఢిల్లీలోకి రాకుండా రోడ్లను దిగ్బందించాలని హర్యానా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఒక పిటిషన్‌లో తప్పుబట్టింది. రైతులు జాతీయ రహదారులను దిగ్బందించడం వల్ల ప్రజలు, ఇతర రోజూవారీ కార్యకలాపాలపై ప్రభావం పడుతుందని మరో పిటిషన్ ఉద్దేశించి వ్యాఖ్యానించింది. నిరసనకారులకు భావ వ్యక్తీకరణకు ప్రాథమిక హక్కు ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన పౌరులను రక్షించడంతో పాటు వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని కోర్టు పేర్కొంది. భావవ్యక్తీకరణ, మాట్లాడటం ప్రాథమిక్ హక్కుల్లో సమతుల్యత ఉండాలి, హక్కులు ఏవీ విడిగా ఉండవని, జాగ్రత్తను గుర్తుంచుకోవాలి, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి, ప్రస్తుత వివాదంతో అన్ని పక్షాలు కూర్చొని చర్చించుకోవాలని కోర్టు వ్యాఖ్యానించింది. హైకోర్టు కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది, నిరసన తెలిపేందుకు స్థలాన్ని గుర్తించాలని కోరింది. తరుపరి విచారణ ఫిబ్రవరి 15న జరగనుంది.

# కోరుట్లలో అక్రమ నిర్మాణాల కూల్చివేత





కోరుట్ల ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):

కోరుట్ల పట్టణం లో అక్రమంగా మరియు ఎలాంటి అనుమతి లేకుండా నాలాలపై నిర్మించిన కట్టడాలను ఎన్ఫోర్స్మెంట్ టీమ్ లీడర్, రెవెన్యూ డివిజనల్ అధికారి మునిసిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ టీమ్ సభ్యులచే తొలగించారు. ఇందులో భాగంగా శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయం ఉత్తరం దిక్కున నాళాను ఆక్రమించిన నిర్మాణం ను, 22వ వార్డ్ లో రోడ్ పై నిర్మించిన ర్యాంప్ ను మరియు సాయి బాబా టెంపుల్ వెనక గల రహదారి లో నిర్మిస్తున్న నిర్మాణం లను తొలగించడం జరిగినది. అలాగే హై కోర్ట్ ఆదేశాల మేరకు జవహర్ రోడ్ లో సెట్ బ్యాక్ లేకుండా నిర్మించిన చౌహాన్ లలిత నిర్మాణం పై తగు చర్యలు తీసుకొని తొలగించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ టీ.పీ.ఓ ప్రవీణ్, టీ.పీ.ఎస్. రమ్య, ఎన్ఫోర్స్ మెంట్ టీమ్ సభ్యులు రెవెన్యూ శాఖ, అగ్నిమాపక శాఖ, పోలీస్ శాఖ, ఆర్ బి శాఖ అధికారులు మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళ బృందం ద్వారా అవగాహన

మల్లాపూర్ ఫిబ్రవరి 13 (ప్రజామంటలు):



మల్లాపూర్ మండల కేంద్రంలోని జిల్లా ఎస్పీ శ్రీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జగిత్యాల రూరల్ మండల పరిధిలోని కుస్తాపుర్ - రత్నా పుర్ గ్రామం లో పోలీస్ కళాబృందం వారు మూఢ నమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు మరియు ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ ల మోసాలు, సైబర్ మోసాలు,నివారణ పై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమం భాగంగా కళాబృందం సభ్యులు పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. దీని వల్ల గ్రామంలో ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తోంది అని తెలిపారు, సిసి కెమెరాలు ఏర్పాటు సహకరించలని గ్రామస్థులను కోరారు. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని, ప్రభుత్వం, పోలీస్ తరపున అన్ని విధాల సహాయ సహకారులు ఉంటాయని అన్నారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించారు. గ్రామాల్లో అనుమానస్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు వున్న పోలీస్ స్టేషన్ కు తెలియపరచాలని తెలిపారు. గ్రామంలో చిన్న చిన్న తగాదాలకు పోయి జీవితం నాశనము చేసుకొవద్దని, నేర రహిత గ్రామాలుగ చేయడానికి ప్రజలు కృషి చేయాలనీ సూచించారు. మంత్రాలు తత్రాలు ముడనమ్మకాలు నమ్మవద్దని, గ్రామాల్లో ఏ సమ్యస వున్న వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలుపాలన్నారు,లేదా 100 నెంబర్ కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ సి అశోక్ , గ్రామ మాజీ సర్పంచ్, పోలీసు సిబ్బంది, పోలీస్ కళా బృందం సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధర్నా చేస్తుంటే రైతుల్ని పట్టించుకోరా?

- డిమాండ్లు పరిష్కరించాలని మాత్రమే అడుగుతున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుల కోసం "ఎంఎస్‌పీ" చట్టం
- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ:** డిమాండ్ల పరిష్కారం కోసం ఢిల్లీలో నిరసన చేపడుతున్న అన్నదాతలపై టియర్ గ్యాస్ ప్రయోగించడాన్ని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ తప్పుపట్టారు. రాహుల్ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతోంది. తాజాగా ఆయన ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ రైతులు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంపై స్పందించారు. రైతులు కేవలం తమ డిమాండ్లు పరిష్కరించాలని మాత్రమే అడుగుతున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించారు కానీ ఆయన చెప్పిన దానిని అమలు చేయడానికి మాత్రం సిద్ధంగా లేరని విమర్శించారు. రైతుల డిమాండ్లు న్యాయబద్ధమైనవి అని పేర్కొన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం మాత్రం దానిని అమలు చేయడానికి సిద్ధంగా లేదని చెప్పుకొచ్చారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రైతుల హామీలు నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అంతేకాదు స్వామినాథన్ చెప్పినట్లుగా అమలు చేస్తామని రాహుల్ భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమీషన్ ప్రకారం పంటకలు మద్దతు ధర(ఎంఎస్‌పీ)పై చట్టం చేస్తామని మంగళవారం హామీ ఇచ్చారు. ఈ ప్రకటన చారిత్రాత్మకమని, 15 కోట్ల మంది రైతు కుటుంబాలకు భరోసా కల్పించడం ద్వారా వారి జీవితాలను మారుస్తామని రాహుల్ గాంధీ అన్నారు. న్యాయమార్గంలో కాంగ్రెస్ మొదటి హామీ ఇదే అని ఆయన అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్ జిల్లాలో జరిగిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో భాగంగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే కూడా ఇలాంటి హామీలు ఇచ్చారు.

# ఓవర్సీస్‌లో వంద కోట్లు బిజినెస్‌పై ప్రభాస్ కన్ను




రిలీజ్‌కి దగ్గర పడుతుంటే ఔట్‌పుట్ ఎలా వచ్చింది? సెన్సార్ ఏం ఇచ్చింది? అనే విషయాల మీద ఎంత కాన్‌సెన్‌ట్రేషన్ ఉంటుందో, ఏరియాల వైజ్ బిజినెస్ ఎంత జరుగుతోంది? ఈ హీరోకి ఆయా ఏరియాల్లో ఎంత మార్కెట్ ఉంది? ఇంతకు ముందు అక్కడ ఏ లు టాప్ రేంజ్‌లో బిజినెస్ చేశాయి... అనే విషయాల మీద కూడా ఇంట్రస్ట్ అదే రేంజ్‌లో ఉంటుంది. ఇప్పుడు కల్కి విషయంలో సేమ్ డిస్కషన్ షురూ అయింది. తెలుగు ల ప్రీ రిలీజ్ బిజినెస్‌ల గురించి మాట్లాడుకోవాల్సి వస్తే ట్రిపుల్ ఆర్‌ని ఇగ్నోర్ చేయలేం. రిలీజ్‌కి దగ్గర పడుతుంటే ఔట్‌పుట్ ఎలా వచ్చింది? సెన్సార్ ఏం ఇచ్చింది? అనే విషయాల మీద ఎంత కాన్‌సెన్‌ట్రేషన్ ఉంటుందో, ఏరియాల వైజ్ బిజినెస్ ఎంత జరుగుతోంది? ఈ హీరోకి ఆయా ఏరియాల్లో ఎంత మార్కెట్ ఉంది? ఇంతకు ముందు అక్కడ ఏ లు టాప్ రేంజ్‌లో బిజినెస్ చేశాయి... అనే విషయాల మీద కూడా ఇంట్రస్ట్ అదే రేంజ్‌లో ఉంటుంది. ఇప్పుడు కల్కి విషయంలో సేమ్ డిస్కషన్ షురూ అయింది. తెలుగు ల ప్రీ రిలీజ్ బిజినెస్‌ల గురించి మాట్లాడుకోవాల్సి వస్తే ట్రిపుల్ ఆర్‌ని ఇగ్నోర్ చేయలేం. దాదాపు 450 కోట్ల బిజినెస్ చేసి చూపించి అందరి చేతా వావ్ అనిపించారు జక్కన్న. తారక్, చెర్రీ హీరోలుగా నటించిన ట్రిపుల్ ఆర్ కు ప్రీ రిలీజ్ క్రేజ్ మామూలుగా లేదు. ఆ కరిష్మాని క్యాష్ చేసుకున్నారు మేకర్స్. ఇప్పుడు అంతకు మించిన క్రేజ్ మాకుంది అని అంటున్నారు కల్కి ప్రొడ్యూసర్స్. ప్యాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్టామినాను కల్కి 2898 ఏడీ ప్రీ రిలీజ్ బిజినెస్‌లతో ప్రూవ్ చేస్తామంటున్నారు. ఒక్క ఓవర్సీస్‌లోనే దాదాపు 100 కోట్లకు పైగా బిజినెస్‌ని టార్గెట్ చేస్తోంది టీమ్.ఇటు మన దగ్గర కూడా మంచి నెంబర్లనే టార్గెట్ చేస్తున్నారు మేకర్స్. నైజామ్‌లో 75 కోట్ల దాకా బిజినెస్ జరుగుతుందన్నది టాక్. ఆల్రెడీ ఈ ఏరియాలో సలార్‌కు 70 కోట్లకు పైగా షేర్ రావడంతో కాన్ఫిడెంట్‌గా ఉన్నారు మేకర్స్. అసలే ఫ్యూచరిస్టిక్ ఎలిమెంట్స్ తో, నెవర్ బిఫోర్ అన్నట్టు తెరకెక్కుతున్న కావడంతో రెట్టింపు నమ్మ కంతో ఫిగర్‌ని కోట్ చేస్తున్నారు ప్రొడ్యూసర్లు. నైజామ్‌లోనే కాదు, మిగిలిన ఏరియాల్లోనూ రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది కల్కి మూవీ. మే 9న వైజయంతీ మూవీస్‌కి కలిసొచ్చిన డేట్‌లో విడుదల కానుంది కల్కి. అమితాబ్ బచ్చన్, దీపిక పదుకోన్, కమల్‌హాసన్, దిశా పాట్ని అంటూ సూపర్‌డూపర్ కాస్టింగ్‌తో, మంచి టెక్నికల్ టీమ్‌తో సిద్ధమవుతోంది కల్కి. రేంజ్ అలా ఉ

prajamantalau daily pages (14-02-24)_times of varha main (13-2).qxd 2/14/2024 1:11 AM Page 7



## నాకు ఫోన్ చేసి మోదీ తిట్టారు

ప్రముఖ బాలీవుడ్ నటుడు, బీజేపీ నాయకుడు మిథున్ చక్రవర్తి అస్వస్థతకు గురైన విషయం తెల్సిందే. శనివారం ఉదయం ఛాతీ నొప్పితో బాధపడుతున్న ఆయనను కోల్‌కతాలోని అపోలో ఆసుపత్రిలో జాయిన్ చేశారు. ఇక ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడడంతో ఆయనను సోమవారం డిశ్చార్జ్ చేసినట్లు తెలుస్తోంది. ఇక ఆయన కోలుకున్నారని తెలియడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే మిథున్ చక్రవర్తికి కొంత రెస్ట్ అవసరమని వైద్యులు తెలిపారు. కానీ, మిథున్ చక్రవర్తి మాత్రం తనకు షూటింగ్ ఉందని, త్వరలోనే షూట్ లో పాల్గోవాలి అని చెప్పడం ఆయన పనిని ఎంత గౌరవిస్తారో తెలుస్తోంది. ఇక తాజాగా ఆయన ఆరోగ్యం గురించి మీడియా ముందు మాట్లాడారు. " నా ఆరోగ్యం ఇప్పుడు మెరుగ్గా ఉంది. నేను బాగానే ఉన్నాను. కాకపోతే కొన్ని ఆహారపు అలవాట్లను మార్చుకోవాల్సి ఉంది. ఇకనుంచి ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయదల్చుకోలేదు. ఇక రేపటి నుంచి నా పని మొదలుపెట్టాలి. నాకు షూటింగ్ ఉంది. అందులో పాల్గొనాలి. ఇకపోతే హాస్పిటల్ బెడ్ పై ఉన్నప్పుడు ప్రధాని మోదీ నాకు ఫోన్ చేసి తిట్టారు. ఆరోగ్యం విషయంలో ఇంత నిర్లక్ష్యంగా ఉంటావా అంటూ తిట్టారు" అని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం మిథున్ చక్రవర్తి వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. ఇకపోతే ఈ మధ్యనే ఆయనకు పద్మశ్రీ అవార్డును ప్రకటించింది కేంద్రం. బాలీవుడ్‌లో 80, 90వ దశకాల్లో మిథున్ చక్రవర్తి హవా కొనసాగింది. 'అయాం ఏ డిస్కో డ్యాన్సర్' అంటూ ప్రేక్షకులపై చెరగని ముద్రవేశారు. బెంగాలీ కుటుంబానికి చెందిన మిథున్ చక్రవర్తి బాలీవుడ్, బెంగాలీ సినిమాల్లో హీరోగా చేశారు. 100కి పైగా చిత్రాల్లో నటించిన ఆయన చివరిసారిగా బెంగాలీ చిత్రం 'కాబూలీవాలా'లో నటించారు. 'కశ్మీర్ ఫైల్స్' సినిమాలోనూ నటుడిగా ఆయన తన సత్తా చాటారు. శ్రీదేవి సరసన అనేక చిత్రాల్లో నటించిన ఆయన తెలుగులో 'గోపాల గోపాల' చిత్రంలోనూ నటించారు.

## అందుకే మొదటి భార్యతో విడిపోయాను




సీనియర్ నటుడు సురేష్ గురించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయాల్సిన అవసరం లేదు. హీరోగా ఆయన నటించిన సినిమాలు అన్ని మంచి హిట్స్ అందుకున్నాయి. ఇక హీరోగానే కాకుండా విలన్ గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా ఎన్నో మంచి పాత్రల్లో కూడా నటించాడు. ప్రస్తుతం అన్ని భాషల్లో ఆయన మంచి పాత్రలను ఎంచుకొని కెరీర్ ను కొనసాగిస్తున్నాడు. ఇక వయస్సు పైబడడంతో కొద్దిగా చిక్కిపోయిన సురేష్.. అంతే ఉత్సాహంతో పనిచేస్తున్నాడు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో సురేష్ తన కెరీర్ తో పాటు వ్యక్తిగత విషయాలను కూడా పంచుకున్నాడు. సురేష్ కు 21 ఏళ్లకే పెళ్లి అయ్యింది. హరితా రెడ్డి అనే అమ్మాయిని సురేష్ వివాహం చేసుకున్నాడు. ఆమె వయస్సు అప్పటికి 18. ఆమె కూడా ఇండస్ట్రీలోనే ఉండేది. వీరికి ఒక బాబు. ఇక కొన్నేళ్ల తరువాత వీరు విడిపోయారు. ఆ తరువాత సురేష్.. దర్శక రచయిత్రి అయిన రాశీని వివాహమాడాడు. ఇకపోతే ఇప్పటివరకు ఆయన తన మొదటి భార్యకు ఎందుకు విడాకులు ఇచ్చాడు అనేది బయటపెట్టలేదు. ఈ ఇంటర్వ్యూలో ఆ విషయాలను పంచుకున్నాడు. " నా మొదటి భార్య పేరు హరితా రెడ్డి. ఆమెకు 18 ఏళ్ళు ఉన్నప్పుడే నాకు ఇచ్చి పెళ్లి చేశారు. ఆమెకేమో పై చదువులు చదువుకొని అమెరికాలో సెటిల్ అవ్వాలని ఉండేది. నేనేమో సినిమాలు అంటూ తిరిగేవాడిని. మా ఇద్దరి మధ్య ఎలాంటి గొడవలు లేవు. తన ఇష్టాన్ని నేను గౌరవించాను. ఆమె చదువుకొని అమెరికాలో సెటిల్ అయ్యింది. విడాకులు తీసుకున్నాకా అక్కడే రెండో పెళ్లి చేసుకుంది. తన ఆస్తి, నా ఆస్తి అని చూడలేదు.. ఉన్న ఆస్తిలో ఇద్దరం చెరో సగం తీసుకున్నాం. ఇక నేను దర్శక రచయిత్రి అయిన రాశీని వివాహమాడను. భార్యాభర్తలుగా మాత్రమే మేము విడిపోయాము. స్నేహితులుగా ఎప్పుడు కలిసే ఉన్నాం. హరిత భర్త చాలా మంచివాడు. నా కొడుకును కూడా ఎంతో బాగా చూసుకుంటాడు. నేను అమెరికా వెళ్ళినప్పుడల్లా వాళ్ళ ఇంట్లోనే ఉంటాను. వారు ఇండియా వస్తే మా ఇంట్లో ఉంటారు. బంధం విడిపోయినా స్నేహం మాత్రం ఎప్పుడు మా మధ్య ఉంది" అని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి.

## మార్చ్ 29న ఆడియన్స్ ముందుకి టిల్లు స్క్వేర్

డీజే టిల్లు సినిమాతో యూత్ ని విపరీతంగా ఎంటర్టైన్ చేసాడు సిద్ధూ జొన్నలగడ్డ. ఈ సినిమా ఒక డ్రగ్ లా ఆడియన్స్ ని ఎక్కేసింది. రాధిక అనే పేరుని అబ్బాయిలు తెగ వాడేశారు. డీజే టిల్లు సినిమా డైలాగులు ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటాయి. ఆ రేంజ్ హిట్ అయిన ఈ సినిమాకి సీక్వెల్ ని రెడీ చేసే పనిలో ఉన్నాడు సిద్ధూ జొన్నలగడ్డ. మార్చ్ 29న టిల్లు స్క్వేర్ ఆడియన్స్ ముందుకి రానుంది. నేహా స్థానంలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సీక్వెల్ పై అంచనాలు ఎక్కువగానే ఉన్నాయి. సిద్ధూ మాత్రం టిల్లు స్క్వేర్ పైన చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. మరి మార్చ్ 29న టిల్లు స్క్వేర్ ఎలాంటి రిజల్ట్ ని సొంతం చేసుకుంటుంది అనేది చూడాలి. అయితే టిల్లు వచ్చిన వారం రోజులకి ఫ్యామిలీ స్టార్ సినిమాతో విజయ్ దేవరకొండ ఆడియన్స్ ముందుకి వస్తున్నాడు. ది ఫ్యామిలీ స్టార్ సినిమా కారణంగా టిల్లు స్క్వేర్ లాంగ్ రన్ కి సమస్యలు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇదిలా ఉంటే సిద్ధూ జొన్నలగడ్డ మరో రెండు సినిమాలకి ప్యారలెల్ గా వర్కౌట్ చేస్తున్నాడు. ఇందులో తెలుసు కదా ఒకటైతే%‰ా% మరొకటి జాక్. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో "జాక్%‰ా% కొంచెం క్రాక్" సినిమా తెరకెక్కుతుంది. ఇటీవలే టైటిల్ అనౌన్స్మెంట్ జరుపుకోని రెగ్యులర్ షూటింగ్ కూడా జరుపుకుంటున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ కొంచెం గ్యాప్ తర్వాత మళ్లీ స్టార్ట్ అయ్యింది. ఈరోజు నుంచి హైదరాబాద్ లో జాక్ కొత్త షెడ్యూల్ స్టార్ట్ అవనుంది. దాదాపు 35 రోజుల పాటు జరగనున్న ఈ షెడ్యూల్ తో జాక్ సినిమా 65% కంప్లీట్ అవుతుందని సమాచారం. ఈ షెడ్యూల్ లో టాకీతో పాటు యాక్షన్ పార్ట్ ని కూడా తెరకెక్కించనున్నారు.

## వరుస ప్రాజెక్టులతో రజనీ బిజీ.. బిజీ

యంగ్ హీరోలను స్పీడున్నోళ్లు అంటుంటాం. కానీ సీనియర్ల స్పీడు చూస్తుంటే, వి వాంట్ టు ఫాలో ఫాలో యూ అనాలనిపించేలా ఉంది. నేము, ఫేము వాళ్లకి ఊరికి రాదనిపిస్తోంది. మరీ ముఖ్యంగా రజనీ ఫిల్మోగ్రఫీలో లైనప్ చూస్తుంటే... సూపర్ తలైవా అనాలనిపిస్తోంది ఫ్యాన్స్ కి. ఏడు పదులు దాటిన ఏజ్‌లో రఫ్ఫాడించేస్తున్నారు రజనీకాంత్. వయసుకు తగ్గ కేరక్టర్లు సెలక్ట్ చేసుకుంటూ, ఫ్యాన్స్ కి ఏం కావాలో గుర్తుపెట్టుకుని శాటిస్‌ఫై చేస్తూ వారెవా అనిపించుకుంటున్నారు. యంగ్ హీరోలను స్పీడున్నోళ్లు అంటుంటాం. కానీ సీనియర్ల స్పీడు చూస్తుంటే, వి వాంట్ టు ఫాలో ఫాలో యూ అనాలనిపించేలా ఉంది. నేము, ఫేము వాళ్లకి ఊరికి రాదనిపిస్తోంది. మరీ ముఖ్యంగా రజనీ ఫిల్మోగ్రఫీలో లైనప్ చూస్తుంటే... సూపర్ తలైవా అనాలనిపిస్తోంది ఫ్యాన్స్ కి.ఏడు పదులు దాటిన ఏజ్‌లో రఫ్ఫాడించేస్తున్నారు రజనీకాంత్. వయసుకు తగ్గ కేరక్టర్లు సెలక్ట్ చేసుకుంటూ, ఫ్యాన్స్ కి ఏం కావాలో గుర్తుపెట్టుకుని శాటిస్‌ఫై చేస్తూ వారెవా అనిపించుకుంటున్నారు. ఈమధ్య జైలర్‌లో రజనీకాంత్‌ని చూసిన వారు, తలైవర్ ఈజ్ బ్యాక్ అని అన్నారు. నెల్సన్‌తో మళ్లీ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు.జైలర్ సక్సెస్ ఎంజాయ్ చేస్తూ, అందరి ప్రశంసలు అందుకుంటూనే లాల్‌సలామ్ కంప్లీట్ చేశారు రజనీ. కూతురి కోసం చేసిన ఈ కు నెగటివ్ టాక్ స్ప్రెడ్ అయింది. అయినా పట్టించుకోకుండా వాట్ నెక్స్ట్ అంటూ మూవ్ అవుతున్నారు తలైవర్. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో చేయనున్నారు రజనీకాంత్. విక్రమ్, లియో నచ్చి లోకేష్‌కి కాల్షీట్ ఇచ్చారు సూపర్‌స్టార్. రజనీ ఫ్యాన్‌గా తాను ఈ చేస్తానని అనౌన్స్ చేశారు లోకేష్. ప్రస్తుతం జ్ఞానవేల్ షూటింగ్‌తో బిజీగా ఉన్నారు తలైవర్. త్వరలోనే ఈ షూటింగ్ పూర్తవుతుంది. అటు కార్తిక్ సుబ్బరాజ్ కూడా తలైవర్ కోసం కథలు రెడీ చేస్తున్నారు. పేట్ట కాంబో ఈజ్ బ్యాక్ అంటూ అతి త్వరలోనే ను అనౌన్స్ చేసే అవకాశాలు ఉన్నాయంటోంది కోలీవుడ్. అయితే ఈ కథ పేట్టకు సీక్వెల్ అవుతుందా? లేకుంటే ఫ్రెష్ స్టోరీతో సాగుతుందా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్.



## అలాంటి పాత్ర ఇవ్వకండి

దయచేసి నాకు మీ లో అవకాశం ఇవ్వకండి అంటూ సందీప్‌రెడ్డి వంగాను ఉద్దేశించి రిక్వెస్ట్ చేశారు కంగనా రనౌత్. చాలా మంది హీరోయిన్లు కెరీర్‌లో కొన్ని లాంగ్వేజెస్‌కి పరిమితమవుతుంటారు. కానీ శోభిత ధూళిపాళ అలా కాదు. నార్త్ కి వెళ్లకముందే, అక్కడివారితో మంచి బాండింగ్ క్రియేట్ చేసుకుంటున్నారు నటి కీర్తి సురేష్. జాన్వీ, కీర్తి మధ్య జరిగిన సంభాషణ ఆకట్టుకుంటోంది. దయచేసి నాకు మీ లో అవకాశం ఇవ్వకండి అంటూ సందీప్‌రెడ్డి వంగాను ఉద్దేశించి రిక్వెస్ట్ చేశారు కంగనా రనౌత్. ఒకవేళ తన మాట కాదని సందీప్ ఛాన్స్ ఇస్తే, ఆయన ల్లోని ఆల్ఫా మేల్ కేరక్టర్లు ఫెమినిస్టులుగా మారిపోవాల్సి వస్తుందని, అలాంటప్పుడు లు ఫ్లాప్ అవుతాయని అన్నారు. సందీప్ డైరక్ట్ చేసిన యానిమల్ మీద కంగన విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. ఆ మాటలకు స్పోర్టివ్‌గా రియాక్ట్ అయిన సందీప్ రెడ్డి వంగా వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు కంగన.చాలా మంది హీరోయిన్లు కెరీర్‌లో కొన్ని లాంగ్వేజెస్‌కి పరిమితమవుతుంటారు. కానీ శోభిత ధూళిపాళ అలా కాదు. ఏ భాషలో ఏ కథ నచ్చితే అక్కడ చేసుకుంటూ ముందుకెళ్తుంటారు. తెలుగు, తమిళ్, హిందీను దాటేసి హాలీవుడ్ తలుపు తట్టేశారు తెలుగమ్మాయి శోభిత.కథ వినగానే డిఫరెంట్‌గా అనిపిస్తే చాలు, ఇంకా కూడా భాషలను, సరిహద్దులను గురించి ఆలోచించే పరిస్థితి లేదంటున్నారు శోభిత. లేటెస్ట్ ప్రాజెక్ట్ మంకీ మ్యాన్ తన మీద తనకున్న నమ్మకాన్ని మరింతగా పెంచిందని చెప్పారు. యాక్టింగ్‌కి స్కోప్ ఉన్న కేరక్టర్ చేసినప్పుడు ఆ ఆనందమే వేరుగా ఉంటుందని అంటున్నారు శోభిత. నార్త్ కి వెళ్లకముందే, అక్కడివారితో మంచి బాండింగ్ క్రియేట్ చేసుకుంటున్నారు నటి కీర్తి సురేష్. ఆమె హీరోయిన్‌గా అట్లీ ప్రొడక్షన్‌లో నటిస్తున్న బేబీ జాన్. ఈ టీజర్ గురించి కీర్తి పెట్టిన స్టేటస్‌కి జాన్వీ స్పందించారు.అందులోనూ హీరో వరుణ్‌ధావన్ సెంట్రిక్‌గా ఇంట్రస్టింగ్ కాన్వర్జేషన్ నడిచింది. ఎక్స్ క్యూజ్‌మీ బేబీ జాన్, వాట్ హేవ్ యు డన్ టు బేబీ వరుణ్ ధావన్ అంటూ జాన్వీ ప్రశ్నించారు. ఇందుకు... 'దేర్ ఈజ్ నో బేబీ వరుణ్‌ధావన్" అంటూ సరదాగా స్పందించారు కీర్తి. జాన్వీ, కీర్తి మధ్య జరిగిన సంభాషణ ఆకట్టుకుంటోంది.

## బాలీవుడ్ యాక్షన్ మూవీ త్వరలో ఓటీటీ స్ట్రీమింగ్ కి !



హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ జంటగా నటించిన బాలీవుడ్ యాక్షన్ మూవీ ఫైటర్. ఈ మూవీకి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించాడు. గతేడాది దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ షారుక్ ఖాన్ హీరోగా తెరకెక్కించిన పఠాన్ మూవీ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ అయింది.దీనితో ఫైటర్ మూవీకి విడుదలకు ముందు భారీ స్థాయిలో అంచనాలు ఏర్పడ్డాయి..భారీ అంచనాలతో ఈ ఏడాది రిపబ్లిక్ డే కానుకగా రిలీజ్ అయిన ఫైటర్ మూవీకి మిక్స్ టాక్ వచ్చింది. 19 రోజుల్లో ఈ మూవీ రూ.340 కోట్లు వసూలు చేసింది. సినిమాకు మిక్స్‌డ్ టాక్ వచ్చినా.. బాక్సాఫీస్ దగ్గర మాత్రం అద్భుతాలు చేయలేకపోయింది. ఇక ఇప్పుడు ఈ మూవీ ఓటీటీ రిలీజ్ కు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ 'నెట్‌ఫ్లిక్స్' ఈ సినిమా ఓటీటీ హక్కులను సొంతం చేసుకుంది.అయితేఫైటర్ మూవీ జనవరి 25న థియేటర్లలోకి రాగా.. రెండు నెలలోపే అంటే మార్చి 21న నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది.అయితే దీనిపై ఇప్పటి వరకూ అధికారిక సమాచారం ఏదీ రాలేదు. ఈ చిత్రంలో అనిల్ కపూర్ ఓ కీలకమైన పాత్ర పోషించారు.ఫైటర్ మూవీ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సాహసాల చుట్టూ తిరుగుతుంది. పాకిస్థాన్ కు వ్యతిరేకంగా వచ్చిన మరో బాలీవుడ్ సినిమా కావడంతో ఆ దేశం నుంచి ఈ మూవీపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అయితే వీటికి మూవీ టీమ్ గట్టిగానే సమాధానం ఇచ్చింది.అయితే ఫైటర్ మూవీ ఈ మధ్య వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా ఎవరిపై చిత్రీకరించారో అదే ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మూవీ టీమ్ కి పెద్ద షాక్ ఇచ్చింది. ఫైటర్ చిత్రంలో హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ యూనిఫాం ధరించి లిప్ లాక్ సన్నివేశాల్లో నటించారు. దీనిపై అభ్యంతరం తెలుపుతూ ఐఏఎఫ్ అధికారి వింగ్ కమాండర్ సౌమ్యదీప్ దాస్ నోటీసులు పంపించారు. ఐఏఎఫ్ యూనిఫాం కేవలం దుస్తులు మాత్రమే కాదని, విధి నిర్వహణ, దేశ భద్రత మరియు నిస్వార్థ సేవ పట్ల అచంచలమైన నిబద్ధతకు బలమైన చిహ్నమని ఆ నోటీసులో వారు పేర్కొన్నారు.అలాంటి ఉన్నతమైన దుస్తులు ధరించి లిప్ కిస్ పెట్టుకోవడం, శృంగారంతో బంధాలను ప్రోత్సహించే సన్నివేశానికి ఉపయోగించడం అంటే వాయుసేన అధికారులను కించపరచడమే అవుతుందని వారు అభిప్రాయపడ్డారు.

## మరింత అందంగా మెరిసిపోతున్న శ్రీముఖి



బుల్లితెరపై టాప్ యాంకర్లలో శ్రీముఖి ఒకరు. ప్రస్తుతం వరుసగా లు.. ఇటు రియాల్టీ షోలకు హోస్టింగ్ చేస్తూ ఫుల్ బిజీగా ఉంటుంది ఈ అందాల యాంకరమ్మ. జులాయి తో నటిగా కెరీర్ ప్రారంభించిన శ్రీముఖి.. నేను శైలజ తో గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత కొన్ని చిత్రాల్లో సహాయ నటిగా కనిపించి మెప్పించింది. చివరిసారిగా మెగాస్టార్ చిరంజీవి నటించిన భోళా శంకర్ మూవీలో కనిపించింది ఈ ముద్దుగుమ్మ. ఆ తర్వాత మరో ప్రాజెక్ట్ అనౌన్స్ చేయలేదు. బుల్లితెరపై టాప్ యాంకర్లలో శ్రీముఖి ఒకరు. ప్రస్తుతం వరుసగా లు.. ఇటు రియాల్టీ షోలకు హోస్టింగ్ చేస్తూ ఫుల్ బిజీగా ఉంటుంది ఈ అందాల యాంకరమ్మ. జులాయి తో నటిగా కెరీర్ ప్రారంభించిన శ్రీముఖి.. నేను శైలజ తో గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత కొన్ని చిత్రాల్లో సహాయ నటిగా కనిపించి మెప్పించింది.చివరిసారిగా మెగాస్టార్ చిరంజీవి నటించిన భోళా శంకర్ మూవీలో కనిపించింది ఈ ముద్దుగుమ్మ. ఆ తర్వాత మరో ప్రాజెక్ట్ అనౌన్స్ చేయలేదు.ఇదిలా ఉంటే.. సోషల్ మీడియాలో నిత్యం చురుకుగా ఉండే శ్రీముఖి.. ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫోటోస్ షేర్ చేస్తూ నెట్టింట సందడి చేస్తుంటుంది. తాజాగా షేర్ చేసిన ఫోటోస్ ఆకట్టుకుంటున్నాయి.పర్పుల్ కలర్ డ్రెస్ లో ఎంతో అందంగా మెరిసిపోతుంది రాములమ్మ. స్టార్ మాలో వస్తున్న సూపర్ సింగర్స్ షో కోసం ఇలా ముస్తాబయ్యింది శ్రీముఖి. ఎంతో అందంగా ఉంది కదా.

## ఇషాన్ కిషన్‌పై వేటు తప్పదా?



గతేడాది డిసెంబర్ నుంచి టీమిండియా వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ భారత జట్టుకు దూరంగా ఉంటున్నాడు. ఈ ఏడాది ఆరంభంలో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లిన ఇషాన్.. సిరీస్ ఆరంభానికి ముందే స్వదేశానికి వచ్చాడు. అప్పటినుంచి బీసీసీఐ, భారత జట్టు మేనేజ్‌మెంట్‌తో టచ్‌లో లేడు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ఇషాన్ అందుబాటులో ఉంటాడనుకున్నా.. అది జరగలేదు. చివరి మూడు టెస్టులకు ఇటీవల బీసీసీఐ సెలెక్టర్లు భారత జట్టును ప్రకటించినా.. అతడిది చోటు దక్కలేదు. కేఎస్ భరత్, ధ్రువ్ జోరెల్‌లు కీపర్‌గా కొనసాగారు.౨ండో టెస్టు అనంతరం భారత హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ మాట్లాడుతూ.. ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌కు ఎంపిక కావాలంటే ఇషాన్ కిషన్ కచ్చితంగా రంజీ ట్రోఫీ 2024లో ఆడాల్సిందే అని స్పష్టం చేశాడు. అయితే కిషన్ మాత్రం రాహుల్ వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకోకుండా.. బరోడాలో ఐపీఎల్ 2024 కోసం ప్రాక్టీస్ చేస్తున్నాడు. జార?ండ్ తరపున రంజీ ట్రోఫీ 2024లో బరిలో దిగే అవకాశం ఉన్నా.. కిషన్ ఐపీఎల్ కోసం సన్నద్ధమవుతున్నాడు. ఈ విషయంపై బీసీసీఐ సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఓ నివేదిక ప్రకారం.. ఇషాన్‌పై చర్యలకు బీసీసీఐ సిద్ధమైనట్లు తెలుస్తోంది. 2024-25 ఏడాది గాను బీసీసీఐ ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను త్వరలో ప్రకటించనుంది. వచ్చే ఏడాదికి ఇషాన్ కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని బీసీసీఐ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గ్రేడ్ సిలో ఉన్న అతడి కాంట్రాక్ట్‌ను పునరుద్ధరించే ఆలోచనలో బీసీసీఐ లేదట. 2022-23లో తొలిసారి ఇషాన్ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. ఏడాదికి కోటి రూపాయలు వార్షిక వేతనాన్ని అతడు అందుకుంటున్నాడు. ఐపీఎల్ టోర్నీలో ముంబై ఇండియన్స్ తరఫున సత్తాచాటిన ఇషాన్.. జాతీయ జట్టులోకి వచ్చిన విషయం తెలిసిందే. భారత్ తరపున ఇప్పటివరకు ఇషాన్ 2 టెస్టులు, 27 వన్డేలు, 32 టీ20లు ఆడాడు.

## సర్ఫరాజ్ ఖాన్ అరంగేట్రం చేసేనా?

ఫిబ్రవరి 15 నుంచి రాజ్‌కోట్‌లో భారత్-ఇంగ్లండ్ మధ్య మూడో టెస్టు మ్యాచ్ జరగనుంది. మూడో టెస్టుకు కేఎల్ రాహుల్ జట్టుకు దూరమైన సంగతి తెలిసిందే. అతని స్థానంలో దేవదత్ పడిక్కల్‌ను జట్టులోకి తీసుకున్నారు. అలాగే, భారత స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ మొత్తం టెస్ట్ సిరీస్‌కు దూరంగా ఉన్నాడు. మూడో టెస్ట్ మ్యాచ్‌లో, ఇంగ్లండ్ జట్టు పూర్తి లయలో ఉన్నట్లు, చాలా బలంగా కనిపిస్తోంది. కాబట్టి, భారతదేశం బలమైన జట్టుతో మైదానంలోకి దిగవలసి ఉంటుంది. ఈ మ్యాచ్‌లో సర్ఫరాజ్ ఖాన్ అరంగేట్రం చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. మూడో టెస్టు మ్యాచ్‌లో, యశస్వి జైస్వాల్ మరోసారి రోహిత్ శర్మతో కలిసి భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభించనుండగా , శుభ్‌మాన్ గిల్ మూడో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్‌ల గైర్హాజరీలో సర్ఫరాజ్ ఖాన్‌కు నాలుగో ర్యాంక్‌లో అవకాశం లభించవచ్చు. ఇదే జరిగితే ఈ మ్యాచ్ ద్వారా భారత్ తరపున టెస్టుల్లో అరంగేట్రం చేసే అవకాశం ఉంది. రజత్ పాటిదార్‌కు ఐదో నంబర్‌లో బ్యాటింగ్ చేసే అవకాశం రావచ్చు, ఆరో స్థానంలో కేఎస్ భరత్ లేదా ధ్రువ్ జురైల్ ఆడే అవకాశం ఉంది.రవీంద్ర జడేజా మూడో టెస్టులో ఆడతాడా లేదా అనే విషయంపై స్పష్టత లేదు. అతను జట్టులోకి రాకపోతే, అక్షర్ పటేల్ ఏడవ స్థానంలో, ఆర్ అశ్విన్ ఎనిమిదో స్థానంలో ఉంటాడు. రెండో టెస్టులో కుల్దీప్ యాదవ్‌కు అవకాశం లభించింది.

## రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు వరుసగా షాకులు

### ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ టామ్ కర్రన్ గాయంతో జట్టుకు దూరం

ఇంకా నెల రోజులు టైం ఉంది. ఇప్పుడిప్పుడే ఆ జట్టుకు చెందిన ప్లేయర్స్ ఒక్కొక్కరిగా తిరిగి ఫుల్ ఫామ్‌లోకి వస్తున్నారు. అయితేనేం.. ఆ టీంకు అనూహ్యంగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఒకరి తర్వాత ఒకరు జట్టుకు దూరమవుతున్నారు. ఇంతకీ ఆ జట్టు మరేదో కాదు.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. ఆ స్టోరీ ఏంటో ఇప్పుడు చూద్దాం.. ఐపీఎల్ 2024కు ముందుగానే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు వరుసగా షాకులు తగులుతున్నాయ్. ఇప్పటికే ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ టామ్ కర్రన్ గాయం కారణంగా జట్టుకు దూరం కాగా.. ఇప్పుడు మరో ఇంగ్లీష్ ప్లేయర్ గాయం కూడా ఆర్సీబీకి ఆందోళన కలిగించే విధంగా ఉంది. ఇంగ్లాండ్ స్పీడ్‌స్టర్ రీస్ టోప్లీ గాయం మోకాలి గాయం కారణంగా ఈ ఏడాది ఐపీఎల్‌కు దూరమయ్యే ఛాన్స్‌లు కనిపిస్తున్నాయి. ఇప్పటికే దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌కు దూరం కాగా.. త్వరలోనే జరగనున్న పాకిస్తాన్ సూపర్ లీగ్‌లోనూ ఆడే అవకాశాలు లేవు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com